నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 13-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 251 పేజీలు: 4 వెల: రూ.1/-

భారత్‌కు అమెరికా సీడీసీ కరోనా సాయం 27 కోట్లు

న్యూఢిల్లీ,మే 12: కోవిడ్-19 మహమ్మారి నియంత్రణకు భారత్ చేపడుతున్న కార్యక్రమానికి అమెరికా వ్యాధుల నియంత్రణ కేంద్రం (సీడీసీ) 36 లక్షల డాలర్ల (సుమారు రూ. 27 కోట్లు) సహాయాన్ని ప్రకటించింది. ఢిల్లీలోన అమెరికా రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో ఈ సంగతిని తెలియజేసింది. నివారణ, సంసిద్ధత, ప్రతిస్పందన చర్యల నిమిత్తం ఈ భారత్ ఈ సొమ్మును వ్యయం చేస్తుంది. మొదటి విడత సహాయాన్ని కరోనా పరీక్షలకు ఉపయోగిస్తారు. ప్రస్తుత మహమ్మారి మాత్రమే కాకుండా భవిష్యత్తులో వచ్చే ముప్పులను దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రజారోగ్య సిబ్బంది వ్యవస్థను అభివృద్ధి చేయడంలో సీడీసీ స్థానిక భాగస్వాములతో కలిసిపనిచేస్తుంది. గత జనవరి నుంచి సీడీసీ భారత కార్యాలయం జాతయ, ప్రాంతీయ సంస్థలతో భాగస్వామ్య కృషి జరుపుతున్నది. దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ అధికారులు, వైద్యులు, నర్సులు, హాస్పిటల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. హెచ్ఐవీ, టీబీ, మలేరియా నియంత్రణ, పోలియో నిర్మూలన, ఇతర మహమ్మారులను ఎదుర్కోవడంలో సంసిద్ధత విషయంలో భారత్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖతో సీడీసీ దీర్ఘకాలిక అనుబంధాన్ని కొనసాగిస్తున్నది. గత 20 ఏళ్లుగా వివిధ ఆరోగ్య కార్యక్రమాల కింద 280 కోట్ల డాలర్ల సహాయాన్ని వివిధ అమెరికా ప్రభుత్వ సంస్థలు అందించాయని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది.

భారత్‌లో కరోనా విజృంభణ

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ స్వైరవిహారం చేస్తున్నది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా 24,323 మందికి కరోనా పాజిటివ్ అని తేలింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం మే 5న ఉదయం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 46,433గా ఉన్నది. సరిగా వారం గడిచేవరకు 12 నాటికి ఆ సంఖ్య 70,756కి పెరిగింది. అంటే ఏడు రోజుల వ్యవధిలోనే 24,323 కరోనా పాజిటివ్ కేసులు కొత్తగా నమోదయ్యాయి. మే 5న దేశంలో 32,138 యాక్టివ్ కేసులు ఉండగా, 12,726 మంది బాధితులు కోలుకున్నారు. ఈ ప్రాణాంతక వైరస్ వల్ల మొత్తం 1568 మంది మృతిచెందారు. కాగా తాజాగా కేంద్రం ప్రకటించిన వివరాల ప్రకారం దేశంలో యాక్టివ్ కేసులు సంఖ్య 46,008గా ఉండగా, కోలుకున్నవారి సంఖ్య 22,454కు చేరింది. అంటే గతవారంతో పోల్చితే యాక్టివ్ కేసులు మరో 14 వేలు పెరగగా, కోలుకున్న బాధితుల సంఖ్య పది వేలు మాత్రమే పెరిగింది. అయితే నమోదైన కేసులు మాత్రం వీటికి రెట్టింపయ్యాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కరోనా వైరస్‌తో 2293 మంది మరణించారు. ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. దేశంలో అత్యధిక కరోనా కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మహారాష్ట్రలో ఇప్పటివరకు 23,401 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, 868 మంది మరణించారు. గుజరాత్‌లో కరోనా కేసుల సంఖ్య 8,541కి పెరిగింది. రాష్ట్రంలో ఇప్పటివరకు కరోనా వైరస్‌తో 513 మంది బాధితులు

వారం రోజుల్లో దేశవ్యాప్తంగా 24,323 మందికి కరోనా ఇప్పటివరకు కరోనా వైరస్‌తో 2293 మంది మరణం వివరాలు వెల్లడించిన కేంద్ర ఆరోగ్య శాఖ

మృతిచెందారు. ఇక తమిళనాడులో కరోనా కేసులు గత మూడు రోజులు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 8002 కరోనా కేసులు నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో 7,233 కరోనా కేసులు ఉన్నాయి. భారత్‌లో కరోనా లాక్‌డౌన్ సడలింపులు, వలస కార్మికుల తరలింపు తదితర చర్యల నేపథ్యంలో వైరస్ తీవ్రత పెరిగి యాక్టివ్ కేసుల సంఖ్య ఇంకా అధికం కానుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. భారత్ విషయానికి వస్తే మంగళవారం ఉదయం నాటికి దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 70,756 కాగా...మృతుల సంఖ్య 2,293గా ఉంది. ఇక దేశంలో యాక్టివ్ కరోనా కేసుల సంఖ్య 46,008 అని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఇకపోతే ప్రపంచవ్యాప్తంగా 40 లక్షల మందికిపైగా ప్రమాదకర మహమ్మారి కరోనా వైరస్ బారిన పడగా.. వారిలో 2,8లక్షలకుపైగా మృత్యువాత పడ్డారు. అయితే, సుమారు పదిహేను లక్షల మంది కోలుకోవటం కాస్త ఊరట కలిగించే విషయం. అంతర్జాతీయంగా కరోనా కేసుల తాజా సమాచారాన్ని అందించే వెబ్‌సైట్ 'వరల్డో మీటర్' గణాంకాల ప్రకారం... కొవిడ్-19 కేసుల సంఖ్యలో భారత్ అంతర్జాతీయంగా 13వ స్థానంలో ఉంది. ఇక యాక్టివ్ కేసుల సంఖ్య.. అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్, బ్రెజిల్, ఇటలీ, స్పెయిన్‌లో అధికంగా ఉండగా... ఈ జాబితాలో భారత్ ఎనిమిదో స్థానంలో ఉండటం గమనార్హం. భారత్ తర్వాతి స్థానాల్లో పెరూ, టర్కీ, నెదర్లాండ్స్, కెనడా, బెల్జియం, సౌదీ అరేబియా తదితర దేశాలున్నాయి.

కరోనా కట్టడిలో నర్సుల కృషి ఎంతో గొప్పది: ప్రధాని

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో నర్సుల కృషి ఎంతో గొప్పదని ప్రధాని నరేంద్రమోదీ కొనియాడారు. కరోనాను పారదోలేందుకు ప్రపంచవ్యాప్తంగా నర్సులు చేస్తున్న అసాధారణ కృషికి అందరం ధన్యవాదాలు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుదామని ప్రధాని ట్వీట్ చేశారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో మన నర్సింగ్ సిబ్బంది అపారమైన జాలి, దయ, ప్రేమ భావం కలిగి ఉన్నారని ప్రధాని ప్రశంసించారు. నర్సుల సంక్షేమం కోసం కృషిచేస్తామని ఈ సందర్భంగా మనందరం పునరుద్ఘాటించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఆధునిక నర్సింగ్ వ్యవస్థ వ్యవస్థాపకురాలు, సంఘ సంస్కర్త ఎ÷-లోరెన్స్ నైటింగేల్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నాం.

ధాన్య సేకరణలో రెండోస్థానంలో తెలంగాణ

ముందు స్థానంలో ఉన్న పంజాబ్: ఎఫ్‌సిఐ

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): ఈ యాసంగిలో తెలంగాణ రాష్ట్రం భారీగా ధాన్యం కొనుగోలు చేసింది.దేశ వ్యాప్తంగా ధాన్యం, గోధుమల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 664.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సిఐ) ట్వీట్ చేసింది. ధాన్యం సేకరణలో పంజాబ్ మొదటిస్థానంలో నిలవగా, తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. పంజాబ్ రాష్ట్రం 162.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, తెలంగాణ 83.97 లక్షల మెట్రిక్ టన్నులు, హర్యానా 64.23 లక్షల మెట్రిక్ టన్నులు, ఛత్తీస్‌గఢ్ 58.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎఫ్‌సిఐ ప్రకటించింది. మే 9వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా 50 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ ట్విట్టర్‌లో పేర్కొన్న విషయం విదితమే. 50 లక్షల టన్నుల ధాన్యం సేకరణలో ఒక్క తెలంగాణలోనే(మే 7వ తేదీ నాటికి) 34.36 లక్షల టన్నుల ధాన్యం, ఏపీ నుంచి 10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

వూహాన్ నగరంలో మళ్లీ కొత్తగా కరోనా కేసులు

పట్టణం మొత్తంలో పరీక్షలు చేసేలా ఆదేశాలు

బీజింగ్,మే12(ఆర్ఎన్ఎ): నోవెల్ కరోనా వైరస్‌కు కేంద్రబిందువైన చైనాలోని వుహాన్ నగరం పూర్తిగా కోలుకుంది. 76 రోజుల లాక్‌డౌన్ తర్వాత ఇటీవల మళ్లీ ఆ నగరం తెరుచుకున్నది. కానీ గత రెండు రోజుల నుంచి కొత్త పాజిటివ్ కేసులు బయపటుడుతున్నాయి. దీంతో నగర అధికారులు ఓ నిర్ణయం తీసుకున్నారు. వుహాన్ నగరంలో ఉన్న కోటి పది లక్షల మంది జనాభాకు కరోనా పరీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. దీని కోసం నగరంలోని అన్ని డివిజన్లకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. పది రోజుల్లో మొత్తం జనాభాకు పరీక్ష చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రెసిడెన్షియల్ ప్రాంతాలతో పాటు వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో పరీక్షలు ముమ్మరం చేయాలని భావిస్తున్నారు. వుహాన్‌లో ఏప్రిల్ 8వ తేదీన లాక్‌డౌన్ ఎత్తివేశారు. అయితే మే 10, 11 తేదీల్లో కొత్తగా ఆరు కేసులు నమోదు అయ్యాయి. క్వారెంటైన్‌లో ఉన్నవారికి వైరస్ లక్షణాలు బయటపడినాయి. అది కూడా వారంతా ఒకే అపార్ట్‌మెంట్ కావడంతో.. అధికారులు అప్రమత్తమ వుతున్నారు. జనవరి 23 నుంచి ఏప్రిల్ 8 వరకు వుహాన్‌లో లాక్‌డౌన్ విధించారు.

నేడు కృష్ణాయాజమాన్య బోర్డు భేటీ

పోతిరెడ్డిపాడు ఎత్తు పెంపు నిర్ణయంతో ప్రాధాన్యం

హైదరాబాద్,మే12(ఆర్ఎన్ఎ): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సాంకేతిక కమిటీ సమావేశం బుధవారం జరగనుంది. కృష్ణా మిగులు జలాలపై చర్చించేందుకు కేంద్ర జలసంఘం ఐఎండీ సీఈ, కృష్ణా బోర్డు సభ్యుడు హరికేశ్ మీనా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతరాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజనీర్లు సమావేశం కానున్నారు. కరోనా నేపథ్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం జరగనుంది. పోతిరెడ్డిపాడు ద్వారా అదనపు నీరు తరలించే కుట్ర సాగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామంటూ 2019 ఆగస్టు 12న తెలంగాణ సీఎం కేసీఆర్ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. నదీజలాల వినియోగంలో తాను, ఏపీ ముఖ్యమంత్రి జగన్ కలిసి తెలుగువారి 60 నుంచి 70 ఏళ్ల చరిత్రలో కొత్త అధ్యయనం సృష్టించనున్నామని ప్రకటించారు. ఈ విషయం కొందరికి అర్థం కాకపోవచ్చునని, కొందరు జీర్ణం చేసుకోలేకపోవచ్చునంటూ వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని జగన్మోహన్ రెడ్డి ఏపీ అసెంబ్లీలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మాగ్నానమిటిగా మాట్లాడారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

సంగారెడ్డి,మే 12 : బైక్ ను వేగంగా నడిపి ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఈ విషాద ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కా పూర్ సమీపంలో చోటు చేసుకుంది. మునిపల్లి మండలం పోల్కమ్ పల్లి గ్రామానికి చెందిన ప్రభు, కంకోల్ గ్రామానికి చెందిన మహేష్ ఇద్దరు బైక్ ను వేగంగా నడుపుతూ డివైడర్ కు ఢీ కొట్టారు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు ఇద్దరికీ భార్య, పిల్లలు ఉన్నారు. మృత దేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

విద్యుత్ షాకుతో దంపతుల మృతి

నిజామాబాద్,మే12(ఆర్ఎన్ఎ): జిల్లాలోని డిచ్‌పల్లి మండలం మిట్టపల్లిలో విషాద సంఘటన చోటుచేసుకుంది. మామిడి కాయలు కోసేందుకు నసురుల్లాబాద్ నుంచి దంపతులు శంకర్, మోనాబాయి మిట్టపల్లికి వచ్చారు. కాగా బోరు వద్ద నీటి కోసం వెళ్లి కరెంట్‌షాక్‌కు గురయ్యారు. అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్ గురై దంపతులు మృతిచెందారు.

ఎయిర్ ఇండియా ఉద్యోగికి కరోనా పాజిటివ్

ప్రధాన కార్యాలయాన్ని మూసేసిన అధికారులు

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా ఉద్యోగి ఒకరు కరోనా వైరస్ బారిన పడ్డారు. దీంతో ఢిల్లీలోని ఎయిరిండియా ప్రధాన కార్యాల్యాయాన్ని మూసి వేశారు. పూర్తి శానిటైజేషన్ కార్యక్రమాన్ని చేపట్టేందుకు రెండు రోజుల పాటు ఆఫీసుకు సీలు వేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. తమ కార్యాలయంలోని ఫ్యూన్‌కు కరోనా వైరస్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిందని, దీంతో ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ సింగ్ ఖరోలాతో సహా అందరూ ఇంటి నుండే పని చేస్తారని ఎయిరిండియా మంగళవారం తెలిపింది. బాధితుడు ప్రస్తుతం రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు ప్రకటించింది. కాగా లాక్‌డౌన్ కారణంగా విదేశాల్లో చిక్కుకున్న వారిని స్వదేశానికి తీసుకొచ్చే కార్యక్రమం వందే భారత్ మిషన్‌లో పాల్గొనే ఏకైక విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా. మే 7- మే 14 మధ్య 64 విమానాల ద్వారా 12 దేశాల నుండి 15 వేల మందిని తీసుకురావాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు దేశంలో 70,000 మందికి పైగా కరోనా బారిన పడగా, 2,290 మంది మరణించారు. మరోవైపు కరోనా కట్టడిలో భాగంగా కొన్ని సడలింపులతో మే 17 వరకు లాక్‌డౌన్ మూడవ దశ కొనసాగుతోంది.

ఎయిమ్స్ నుంచి డిశ్చార్జ్ అయిన మన్మోహన్

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఎయిమ్స్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కొన్ని కొత్త ఔషధాల వాడకంతో రియాక్షన్ వచ్చి జ్వరం రావడంతో ఆదివారం రాత్రి మన్మోహన్‌సింగ్ ఎయిమ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. అయితే సోమవారం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగైందని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. మన్మోహన్‌సింగ్‌కు కరోనా పరీక్ష కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఫలితం నెగెటివ్‌గా వచ్చిందన్నారు. పూర్తిగా కోలుకున్న మన్మోహన్ సింగ్ మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి వెళ్లారు.

సిరిసిల్ల నేత కార్మికులను చూసి గర్విస్తున్నా

ఆరోగ్యంగానే ఉన్నానంటూ కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,మే12(ఆర్ఎన్ఎ): సిరిసిల్లకు చెందిన ప్రతిభావంతమైన నేత సోదర, సోదరీమణులను చూసి గర్విస్తున్నట్లు మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల నేత కార్మికులు బతుకమ్మ చీరల ఉత్పత్తి తయారీని తిరిగి ప్రారంభించారు. దీనిపై మంత్రి ట్విట్టర్ ద్వారా స్పందిస్తూ... సిరిసిల్ల నేతను గుర్తించే బ్రాండ్‌గా చేయడమే స్థానిక ఎమ్మెల్యేగా తన లక్ష్యమన్నారు. టెక్స్‌టైల్ పార్క్, అపెరల్ పార్క్ ఈ లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. మరోవైపు తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రకటించారు. తన ఆరోగ్యంపై ఆందోళన చెందొద్దని ట్విట్టర్ వేదికగా విజ్ఞప్తి చేశారు. నిన్నటి నుంచి తన ఆరోగ్యంపై ఆందోళన చెందిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని.. తాను బాగానే ఉన్నానన్నారు. సిరిసిల్లలో సోమవారం నాటి పర్యటన సందర్భంగా తనకు అనేక సంవత్సరాలుగా ఉన్న జలుబుకు సంబంధించిన ఎలర్జీ వచ్చిందన్నారు. అప్పటికే పర్యటనకు సంబంధించిన పలు కార్యక్రమాలు సిద్ధంగా ఉన్న నేపథ్యం లో.. ఎవరికీ ఇబ్బంది కలగొద్దన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని కొనసాగించాల్సి వచ్చిందన్నారు.

రెండు రాకెట్లను ప్రయోగించిన చైనా

ఇంటర్నెట్ ఆధారిత సేవల కోసం అని వెల్లడి

బీజింగ్,మే12(ఆర్ఎన్ఎ): చైనా మంగళవారం రెండు ఉపగ్రహాలను ప్రయోగించింది. ఇంటర్నెట్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోసం ఆ శాటిలైట్లను నింగిలోకి పంపింది. జిన్‌గున్-2కు చెందిన రెండు ఉపగ్రహాలను .. కువజువా-1ఏ రాకెట్ ద్వారా ప్రయోగించారు. జుక్వాన్ శాటిలైట్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం సాగింది. విజయవంతంగా ఆ రెండు ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. జిన్‌గున్ శాటిలైట్ కంపెనీ.. ఆ రెండు ఉపగ్రహాలను డెవలప్ చేసింది. అంతరిక్ష ఆధారిత ఇంటర్నెట్ సేవలపై ఆ శాటిలైట్లు ప్రయోగాలు చేపడుతాయి. ఐఓటీ అప్లికేషన్స్‌పై పైలట్ పరిశోధన చేపట్టనున్నాయి. లో ఆర్బిట్ స్మాల్ శాటిలైట్లను నింగిలోకి పంపేందుకు కేజెడ్-1ఏ రాకెట్‌ను వాడుతారు. కేజెడ్ సిరీస్‌లో ఇది తొమ్మిదవ రాకెట్ కావడం విశేషం.

ఆర్థిక దిద్దుబాటు మొదలుపెట్టిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

రాయ్‌పూర్, మే 12: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో అన్నిరాష్ట్రాలు ఆర్థిక కష్టాలు ఎదుర్కోనున్నాయి. ఆర్థిక సమస్యలను అందరికన్నా ముందుగానే పసిగట్టిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం.. ప్రభుత్వ ఖర్చులను తగ్గించుకొనేందుకు ప్రణాళికలు రచించింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం లేఖలు పంపింది. సాధారణ బడ్జెట్‌లో 30 శాతం మేర కోతలు విధిస్తున్నామని, 70 శాతమే ఖర్చు పెట్టుకోవచ్చునని ఆ లేఖలో ప్రభుత్వం స్పష్టంచేసింది. నిర్మాణంలో ఉన్న పనులను సాధ్యమైనంత వరకు పూర్తిచేసేందుకు ఆయా విభాగాలు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతేనేగానీ కొత్త పనులు చేపట్టరాదని సూచించింది. రాష్ట్ర ఫైనాన్స్‌శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ అమితాబ్‌జైన్ ప్రకారం, ఈ ఏడాది అన్నివిభాగాలకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో రూ.95 వేల కోట్లు. ఇప్పుడు 30 శాతం కోత విధించడం ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.25వేల కోట్లు మిగులనున్నాయి.

గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌కు 13 నుంచి సెలవు

హైదరాబాద్ : నగరంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌కు ఈ నెల 13వ తేదీ నుంచి అధికారులు సెలవు ప్రకటించారు. మార్కెట్ ప్రాంగణంలో భౌతిక దూరం పాటించాలన్న నిబంధనలకు విఘాతం కలగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నిబంధనలు ఉల్లంఘించిన 44 మంది కమీషన్ ఏజెంట్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కోహెడ మార్కెట్ బంద్ కారణంగా గడ్డి అన్నారం మార్కెట్‌లో వ్యాపారుల రద్దీ పెరిగింది.

భారీగా వీచిన ఈదురుగాలులకు కోహెడ పండ్ల మార్కెట్ ఈ నెల 4వ తేదీన నేలమట్టమైన విషయం విదితమే. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కరోనా నేపథ్యంలో గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌ను తాత్కాలికంగా కోహెడకు తరలించిన విషయం తెలిసిందే. కోహెడ వద్ద పండ్ల మార్కెట్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

కరోనా కాలంలో.. మహిళా కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో కీలకం

హైదరాబాద్ మే 12: బషీర్‌బాగ్‌లోని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో కరోనా ఉమెన్ వారియర్స్ వీడియోను సీపీ అంజనీ కుమార్ ఆవిష్కరించారు. పలువురు మహిళా కానిస్టేబుళ్లను మొమెంటోలతో సీపీ సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్, రాత్రి కర్ఫ్యూలను విజయవంతం చేశామని స్పష్టం చేశారు. లాక్‌డౌన్ సమయంలో మహిళా పోలీసులు నిరంతరం డ్యూటీ చేస్తున్నారని కొనియాడారు. ఐసోలేషన్, క్వారంటైన్లలో మహిళా కానిస్టేబుళ్ల పాత్ర ఎంతో అవసరమని చెప్పారు. కొన్ని పోలీసు స్టేషన్లలో కేవలం ఒక్కరు మాత్రమే ఉంటే.. మిగతా వారందరూ లాక్‌డౌన్ విధుల్లో ఉన్నారని సీపీ తెలిపారు.

పాలమూరు ఎంపి మన్నెకు ఫోన్

కరోనా కట్టడిపై వెంకయ్య ఆరా

మహబూబ్‌నగర్,మే12(ఆర్ఎన్ఎ): మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డికి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఫోన్ చేశారు. ఎంపీ, వారి కుటుంబ సభ్యుల క్షేమ సమాచారాలను గురించి వాకబు చేశారు. కరోనా మహమ్మారి కబళిస్తున్న ఈ విపత్కర పరిస్థితుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎంపీకి సూచించారు. రాష్ట్రంలో కరోనా కట్టడి విషయంలో ప్రభుత్వాలు చేపడుతున్న చర్యల గురించి వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా ఎంపీతో ఆరా తీశారు. కరోనా కట్టడి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్టమైన చర్యలు చేపట్టడం వల్లే రాష్ట్రంలో కరోనా మహమ్మారి నియంత్రణలో ఉందని ఉపరాష్ట్రపతి అన్నారని ఎంపీ తెలిపారు. పేద మధ్య తరగతి వర్గాల ప్రజలు ఏ మాత్రం ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని రకాల సహాయ చర్యలు విస్తృతంగా చేపడుతున్నట్లు వెంకయ్య నాడుకు తెలిపినట్లు ఎంపీ వివరించారు. తమ కుటుంబం తరపున తాము కూడా సాధ్యమైనంతవరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపామన్నారు.

కరోనా కట్టడిలో వైద్యులు, సిబ్బంది పాత్ర వెలకట్టలేనిది

మహబూబ్‌నగర్ , మే 12: కరోనా మహమ్మారిని అరికట్టడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న వైద్య సిబ్బంది సేవలు ఎంతో గొప్పవని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎటం ఆధ్వర్యంలో నర్సులకు, దవాఖాన సిబ్బందికి (కొవిడ్-19) కరోనా వైరస్ ప్రొటెక్షన్ కిట్స్ ను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా కట్టడికి జిల్లా యంత్రాంగం అంతా ఎంతో కృషి చేసిందన్నారు. ప్రాణాలకు తెగించి వైద్యం చేస్తున్న వారి సేవలను కొనియాడారు.

చరిత్రలో నేటినిజం

కం॥ జ్ఞానము.... మతేతి యాపై
మానవమగు సోరు సలపి మందు కనుగొనన్
రానాల్డనను గరిని
ధ్యానించుచు నుంటి నెను ధన్యుం డనుచున్॥

(మే 13 రోనాల్డ్ రోస్ జయంతి)

-రాధశ్రీ
సెల్: 9494481210

ఈ ఆగమనం..ఆందోళన కాబోతుందా?

నేటినిజం
బుధవారం 13-5-2020

యావత్ ప్రపంచం కరోనా చేతుల్లో చిక్కుకు పోవడం ఒక ఎత్తైతే , విదేశాల్లో చిక్కుకుపోయిన వేలాదిమంది భారతీయులను రక్షించడం మరో ఎత్తు. అందుకే స్వదేశానికి తీసుకొచ్చే భారీ కార్యక్రమం ఆరంభం కాబోతున్నది. దాదాపు మూడులక్షలమంది కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తులు పెట్టుకున్న నేపథ్యంలో, దశలవారీగా జల, వాయుమార్గాల్లో వారిని తరలించాలని భారత ప్రభుత్వం సంకల్పించింది. ఎయిర్ ఇండియా తొలివిడతలో రేపటినుంచి 13వ తేదీ వరకూ 13 దేశాలనుంచి 64 విమానాలతో ఒకేవారంలో దాదాపు పదిహేను వేలమందిని స్వదేశానికి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంది. గల్ఫ్‌యుద్ధం తరువాత ఎయిర్ ఇండియా ఇంతపెద్ద కార్యక్రమాన్ని చేపట్టడం ఇదే తొలిసారి. ఏ మార్గంలో స్వదేశానికి వస్తున్నా, వారందరికీ క్షుణ్ణంగా వైద్యపరీక్షలు చేసిన తరువాతే దేశంలో అడుగు పెట్టనిస్తామని కేంద్రం హామీ ఇస్తున్నది. భారత్ వచ్చిన తరువాత వీరందరూ విధిగా పద్నాలుగు రోజులు క్వారంటైన్‌లో ఉండాలి. ఆ తరువాత వారి ఆరోగ్యస్థితికి అనుగుణంగా నిర్ణయాలు జరుగుతాయి. వారికి అవసరమైన పరీక్షలు, క్వారంటైన్ ఏర్పాట్లు చేయాల్సింది ఎలాగూ రాష్ట్రాలే. కరోనా లక్షణాలు లేనివారిని మాత్రమే ప్రయాణానికి అనుమతిస్తామనీ, దగ్గు, జలుబు ఇత్యాదివి ఉన్నట్టయితే ముందుగానే సమాచారం ఇవ్వాలనీ, ప్రయాణంలో సైతం కొన్ని నిబంధనలు తూచ తప్పక పాటించాల్సిందేనని విదేశాంగ శాఖ గట్టిగా చెబుతున్నది. కాకుంటే కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ మాత్రం ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వూహాన్ నుంచి వచ్చిన ఓ వైద్య విద్యార్థిని కారణంగా దేశంలో తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదు చేసుకున్న రాష్ట్రం అది. విదేశాల్లో చిక్కుకున్నవారిని స్వదేశానికి తీసుకురావాలన్న కేంద్రం నిర్ణయం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంత మాత్రం సరైనది కాదని విజయన్ అంటున్నారు. పూర్తిస్థాయి కరోనా పరీక్షలతో రోగం లేదని నిర్ధారించుకున్నవారిని మాత్రమే ఇలా తేవాల్సింది పోయి, కేవలం థర్మల్ స్క్రీనింగ్‌తో విమానాలు ఎక్కించడం ఏమిటని ఆయన అడుగుతున్నారు. ఏ ఒక్కరికి వైరస్ ఉన్నా, విమానంలో ఉన్న మిగతా వారంతా ప్రమాదంలో పడతారనీ, పైగా, వైరస్ ప్రభావం తీవ్రంగా ఉన్న అమెరికా, బ్రిటన్ ఇత్యాది దేశాల్లో ఉన్నవారిని తరలిస్తే పెను సమస్యలు వస్తాయని ఆయన హెచ్చరిస్తున్నారు. అమెరికా, బ్రిటన్‌లు ఏ స్థితిలో ఉన్నాయో తెలిసిందే. బ్రిటన్ మరణాల్లో ఇటలీని మించిపోయింది. విదేశాల్లోని భారతీయులు పెద్ద సంఖ్యలో కరోనా బారినపడ్డారు. ముఖ్యంగా గల్ఫ్‌దేశాల్లోనే దాదాపు పదివేలమందికి పైగా భారతీయులకు కరోనా సోకిందని వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో, వీరందరి రాకతో ఇంతకాలం కష్టపడి అమలు చేసుకున్న కట్టడికి ప్రయోజనం లేకుండా పోతుందన్న అనుమానం ఎవరికీ ఎందుకు రావడం లేదనేదే ఇప్పుడు ఆందోళన.. వారంతా మన దేశంలోని వారే. కాదనము. మందే లేని ఈ కరోనా బారిన ఇండియా పడితే ఇంకేమయినా ఉందానేదే ప్రశ్న!

మూడుచోట్లకు పండ్ల మార్కుట్లు తరలింపు

-మరింత గందరగోళంగా తయారైన పరిస్థితి

హైదరాబాద్,మే12ఆర్ఎన్ఎ): కొత్త పేట పండ్ల మార్కెట్ తరలింపుతో అటు వ్యాపారులకు, ఇటు కొనుగోలు దారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిని నగరానికి దూరంగా తరలించడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల్రు, ఆయా దేశాల నుంచి కూడా ఇక్కడికి పండ్లు రావడంతో గ్రేటర్ పరిధి నుంచే కాకుండా ఆయా జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలు వ్యాపారులు, రైతులు ఈ మార్కెట్‌కు వస్తారు. దీంతో ఇక్కడ కరోనా వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్తగా మార్కెట్‌ను మూడు ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కొత్తపేట ఫ్రూట్ మార్కెట్‌లో మామిడి బత్తాయి, సరూనగర్ రైతు బజార్ వెనుక వైపు టెలిఫోన్ కాలనీ వెళ్లే మార్గంలో ద్రాక్ష, ఆరెంజ్, సపోటా, ఉప్పల్ భగాయత్ మార్కెట్‌లో బప్పాయి, వాటర్ మిలన్‌తో పాటు ఇతర పండ్లు విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో దాదాపు వారం రోజులుగా మూడు ప్రాంతాల్లో మార్కెట్ కొనసాగుతోంది. ఈ విషయాన్ని పండ్ల వ్యాపారులు గ్రహించాలని అధికారులు తెలిపారు. మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు కొత్తపేట ఫ్రూట్ మార్కెట్‌ను మూడు ప్రాంతాలకు తరలించారు. మామిడి సీజన్‌తో పాటు రంజాన్ నెల నేపథ్యంలో పండ్లు కొనుగోలు చేయడానికి మార్కెట్‌కు వేల సంఖ్యలో జనం వస్తున్నారు. ఇక్కడ రద్దీని తగ్గించడంతో పాటు భౌతిక దూరం పాటించేందుకు వీలుగా కమిషన్ ఏజెంట్లు ఫ్రూట్స్‌ను మూడు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని అధికారులు చెప్పారు. మార్కెట్ మూడు ప్రాంతాల్లో ఉండటంతో యార్డు ఇన్‌చార్జ్‌లకు కష్టమవుతోంది. గతంలో కొత్తపేటలోనే అన్ని పండ్ల విక్రయాలు జరిగేవి. మొత్తం మా ర్కెట్‌ను ఉన్నత అధికారులు మూడు భాగాలుగా విభజించి సూపర్‌వైజర్లకు డ్యూటీలు వేసేవారు. ప్రస్తుతం ఒక్కో మార్కెట్‌కు ఇద్దరు సూపర్‌వైజర్లతో పాటు ఇతర సిబ్బంది నియమించాల్సి వస్తోంది. దీంతో అధికారులు, సిబ్బందిపై అధిక పనిభారం పడటంతో పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అధికారులు అంటున్నారు. మార్కెట్‌లో శానిటేషన్‌తో పాటు భౌతికదూరం పాటించాలనిజీహెచ్ఎంసీతో పాటు మార్కెట్ సిబ్బంది, పోలీసులు రైతులకు, వ్యాపారులకు అవగాహనకల్పిస్తున్నారు.

108లో కవలలు జననం..తల్లీబిడ్డలు క్షేమం

మహబూబాబాద్ ,మే 12: జిల్లాలోని బయ్యారం మండలం సింగారం గ్రామానికి చెందిన బుర్ర కుమారి నిండు గర్భిణి. పురిటి నొప్పులు రావడంతో ఆమెను తల్లిదండ్రులు బయ్యారం పీహెచ్‌సీ కి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా వాహనంలోనే కవలలకు (పాప, బాబు) జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. సకాలంలో వైద్యం అందించి సుఖ ప్రసవం జరిగేలా చేసిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

జూరాల ఎగువన మరో జలాశయానికి అవకాశం

-ఇంజనీర్ల సూచనలతో అధికారుల కసరత్తు

గద్వాల,మే12ఆర్ఎన్ఎ): అదనపు జలాశయాన్ని నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. 3,600ఎకరాల్లో 20 టీఎంసీల సామర్థ్యంతో జలాశయ నిర్మాణాన్ని చేపట్టనుండగా కట్ట పొడవు 15 కిలోమీటర్లు ఉంటుంది. జూరాల కుడి కాల్వ పరిధిలోని 37వేల ఎకరాలతో పాటు నె÷-టటెంపాడు, తుమ్మిళ్ల ఎత్తిపోతలు కలుపుకొని 2.70 లక్షల ఎకరాలకు, జూరాల ఎడమ కాల్వ పరిధిలోని 63 వేల ఎకరాలతోపాటు భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులతో కలుపుకొని మూడు లక్షల ఎకరాలకు సాగునీటి ని అందించవచ్చని ఇరిగేషన్ అధికారులు లెక్క తేల్చారు. జలాశయంలోకి నీటిని పంపింగ్ చేసేందుకు 40 మెగావాట్ల సామర్థ్యంతో 5 పంపులు అవసరమవుతాయి. ఇదే అంశాలను పేర్కొంటూ తుది నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకొని జలాశయం నిర్మాణం చేపడితే ఉమ్మడి జిల్లాలో సుమారు 6లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ భాగాన మరో జలాశయం నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇది వరకే గట్టు ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా మరో ప్రాజెక్టును తెరమీదకు తెచ్చింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గ్రామాలు, భూములు ఎక్కువగా ముంపు నకు గురవకుండా తక్కువ భూ సేకరణతో జలాశయం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఇటీవల రిటైర్డ్ ఇంజినీర్ల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలతో నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఇదే నివేదికను ప్రభుత్వం ఈఎన్‌సీ అధికారులకు అందజేసి పరిశీలించాలని ఆదేశించింది. దీంతో ఉన్నతాధికారులు గద్వాల జిల్లా ఇంజినీరింగ్ అధికారులను విచారణ చేసి నివేదిక అందించాలని సూచించడంతో 16 రోజుల క్రితం పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందించారు. జూరాల వెనక జలాలకు సుమారు అర కిలోమీటర్ దూరంలో ద్యాగదొడ్డి, నాగర్‌దొడ్డి ప్రాంతాల నడుమ అనుమతి వస్తే కార్యాచరణకు సిద్ధం కానున్నట్లు సమాచారం. జూరాల జలాశయం పక్కన 20 టీఎంసీల సామర్థ్యంతో అదనపు జలాశయ నిర్మాణానికి సంబంధించి నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన వెంటనే కార్యాచరణ మొదలవుతుంది. గద్వాలతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోనూ సాగునీటి కష్టాలు తీరుతాయని అంటున్నారు. గట్టు మండలం పెంచికలపాడు సమీపంలో ఎత్తిపోతలను నిర్మించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.570 కోట్లతో గట్టు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఇదే క్రమంలో 20టీఎంసీల సామర్థ్యంతో జూరాలకు పక్కనే అదనంగా మరో జలాశయాన్ని నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

ప్రజల బాధలపై ప్రస్తావన ఏది?

హైదరాబాద్, మే12(ఆర్ఎన్ఎ):కరోనా, లాక్‌డౌన్‌లతో దారుణంగా దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని గాడిన పెట్టేందుకు ఎలాంటి వ్యూహం అనుసరించబోతున్నారో ప్రధాని మోడీ సిఎంలకు వివరించలేక పోయారు. అలాగే వారు కోరినట్లుగా రుణ పరిమితిని పెంచడం, ఆర్థికంగా ఆదుకోవడంలోనూ ఎలాంటి హామీ ఇవ్వలేదు. అలాగే ఏయే రంగాలను ఎలా ఆదుకోబోతున్నదీ చెప్పడం లేదు. మొత్తంగా చూస్తే లాక్‌డౌన్‌తో ప్రజలను వారి ఖర్మకే వదిలేస్తారా అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు చూస్తుంటే పెద్దగా ప్రజలకు ఉపయోగ పడే అంశాలు ఏవీ లేవు. రైళ్లకు టిక్కెట్లు పెట్టుకోమన్నారు. విమానాల్లో వచ్చే వారికి లక్షకు తక్కువ కాకుండా టిక్కెట్ పెట్టారు. క్వారంటైన్‌లో ఖర్చులు వారే భరించేలా చేశారు. పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచారు. ఈ దశలో ఇక సామాన్య, మధ్య తరగతి బతుకులు మరింత దుర్భరంగా ఉంటాయని హెచ్చరికలు చేసినట్లుగా కేంద్రం తీరు ఉంది. తాజాగా సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్రసాయం అందించాలని పలురాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అభ్యర్థించారు. కరోనా నియంత్రణ, లాక్‌డౌన్ నిర్వహణ, ఆర్థిక రంగ ఉద్దీపన సహా పలు అంశాలపై వారు అనేక అంశాలను ప్రస్తావించినా దేనికీ ఔనని కానీ...కాదని కానీ చెప్పలేదు. కరోనా మహమ్మారిపై పోరుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ విషయంలో సమతుల వ్యూహం అవసరమని మాత్రమే సీఎంలతో భేటీలో ప్రధాని వ్యాఖ్యానించారు. రాష్ట్రాలు ఇచ్చే సూచనల ఆధారంగానే ఆ వ్యూహం రూపొందుతుందన్నారు. లాక్‌డౌన్‌కు సంబంధించి తమ సమగ్ర వ్యూహాలను మే 15 లోగా పంపించాలని ముఖ్యమంత్రులను ప్రధాని కోరారు. అయితే ఇందులో ఆర్థిక అంశాలను పెద్దగా ప్రస్తావించలేదు. ఎలా గట్టెక్కాలో సూచనగా అయినా చెప్పలేక పోయారు. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించినా నష్టపోయిన రంగాలను ఎలా ముందుకు తీసుకుని వెళతారో చెప్పలేకపోయారు. ఆర్థిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో పునఃప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాత్రమే చెప్పారు. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు తమ గ్రామాలకు వెళ్లిపోతున్న పరిస్థితుల్లో పారిశ్రామిక కార్యకలాపాల పునరుద్ధరణ ప్రస్తుతం సమస్యగా మారిందన్న అంశం భేటీలో చర్చకు వచ్చింది. ముఖ్యమంత్రుల అభిప్రాయాలు తీసుకున్న తరువాతనే లాక్‌డౌన్‌ను ఎత్తివేయడమా? లేక కొనసాగించడమా? అనే విషయంపై నిర్ణయం తీసుకోవాలనుకున్నట్లు సీఎంలతో వ్యాఖ్యానించారు. ఇక రాష్ట్రాలకు కూడా అనేక సమస్యలు ఉన్నాయి. కరోనా విజృంభణ కొనసాగుతున్న నేపథ్యంలో పలువురు సీఎంలు లాక్‌డౌన్‌ను మరోసారి పొడగించాలని ప్రధానికి సూచించారు. ఈ నెల మొత్తం రైలు, విమాన ప్రయాణాలపై నిషేధం కొనసాగించాలని ప్రధానిని కోరారు. ఆకలిదప్పులతో కాలినడకన వెళ్తున్న వలస కార్మికుల గురించి మెజారిటీ సీఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ రాష్ట్రంలో వైరస్ ప్రభావం లేని ప్రాంతాల్లో ఎయిర్, రైల్, మెట్రో ప్రయాణాలకు అనుమతిం చాలని కేరళ సీఎం విజయన్ కోరారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్రాలకు ఉండాల న్నారు. లాక్‌డౌన్ నుంచి వ్యూహాత్మకంగా బయటకు వచ్చే వ్యూహాన్ని జాగ్రత్తగా రూపొందించాల్సి ఉందని సిఎంలు కోరారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు ఆర్థిక సాయం అందించాలన్నారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ ఆర్థికంగా బయటపడే మార్గాలపైనే ప్రధాని మోడీతో ప్రస్తావించారు. దాదాపు మూడో నెలలోకి ప్రవేశించినా కేంద్రం ఎలాంటి అడుగు వేస్తుందో ప్రధాని మోడీ సిఎంలతో పంచుకోలేక పోయారు. కేంద్రం వ్యూహం ఏమిటి...రాష్ట్రాలు వాటిని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలన్న సూచన కాన రాలేదు. సంక్షోభం నుంచి బయటపడేందుకు కేంద్రం ఒక స్పష్టమైన వ్యూహంతో ముందుకు రావాల్సి ఉన్నా ఎందుకనో నాన్చుడు ధోరణి కనబరుస్తున్నారు. ఒకవైపు లాక్‌డౌన్‌ను కఠినంగా అమలు చేయాలం టూనే.. మరోవైపు, మినహాయింపుల పేరుతో రైళ్లను నడపడం, రాష్ట్రాల సరిహద్దులను తెరవడం వల్ల కరోనా వ్యప్తి చెందే అవకాశం ఉంది. అయితే రోజులు గడుస్తున్న కొద్దీ కరోనాపై పోరులో నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు అసలు సత్తా ఏమిటో దేశ ప్రజలకు స్పష్టమౌతోంది. అందరికన్నా ముందే లాక్‌డౌన్ ప్రకటించామంటూ భుజాలు చరుచుకున్న కేంద్ర పెద్దలు అంతకు ముందుగాని, ఆ తరువాత గాని చేసిందేమిటో అర్థం కావడం లేదు. నిజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు ఐక్యరాజ్యసమితి కూడా కరోనా నివారణకు లాక్‌డౌన్ ఒకటే ఔషధం కాదని, ఆ తరువాత చేయాల్సిందేంతో ఉందని పదేపదే చెప్పాయి. కానీ, ఆ మాటలను మన పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. లాక్‌డౌన్ ప్రకటించిన ఇన్ని రోజుల తరువాత, సడలింపులు ఇస్తున్న సమయంలోనూ దేశ వ్యాప్తంగా కనిపిస్తున్న హృదయ విదారక దృశ్యాలే నిలువెత్తు సాక్ష్యం! వైరస్‌ను నియంత్రించడమే కాదు, లాక్‌డౌన్ కారణంగా కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించే బాధ్యత కూడా కేంద్రానిదే! కానీ ఈ దిశలో తీసుకుంటున్న చర్యలేవి ప్రజలకు కానీ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కానీ కానరావడం లేదు. బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన సంస్థలకు రూ. వందల కోట్ల రాయితీలు ప్రకటించిన కేంద్రానికి అదే సమయంలో భారీ సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి చేతులు రావడం లేదు. ఫలితంగా దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మృగ్యంగా మారాయి. ఎవరి ఉద్యోగం ఉందో, ఎవరి ఉపాధి కొండెక్కిందో లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తివేస్తే కానీ స్పష్టత వచ్చే అవకాశం లేదు.

లాక్‌డౌన్ ఎత్తివేతపై లేని స్పష్టత

రాష్ట్రాలను ఆదుకునే విషయంలోనూ అంతే

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): తొలి విడత లాక్‌డౌన్ ప్రకటించినప్పుడే కాదు, మలి విడత పొడిగించినప్పుడు, మూడవ విడత లాక్‌డౌన్ ముగియనున్న మే 17 తరువాత కూడా ఎలా వ్యవహరించాలన్న విషయమై కేంద్ర సర్కారు వద్ద నిర్దుష్ట ప్రణాళికేమీ ఉన్నట్టు కనిపించడం లేదు. ఎందుకంటే రాష్ట్రాలకు ఆర్థికంగా ఎలాంటి సాయం అందడం లేదు. కరోనా వైరస్‌తో ఎక్కడికక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడుతున్నాయి. ఆ పోరాటాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉదారంగా తమకు నిధులు విడుదల చేయాలని రాష్ట్రాలు చేస్తున్న విజ్ఞప్తిని మోడీ ప్రభుత్వం బేఖాతరు చేస్తున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. కనీసం ఎఫ్ఆర్‌బిఎం చట్టానికి సవరణలు చేసి, అధిక రుణం తెచ్చుకునే వెసలుబాటు కల్పించాలన్న రాష్ట్రాలసూచనను కేంద్రం పట్టించుకోవడం లేదు. దీనిపై తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి సిఎం వైఎస్ జగన్‌లు పదేపదే కోరుతున్నా పట్టించుకోవడం లేదు. సరికదా పి.ఎం కేర్స్ పేరుతో రాష్ట్రాలకు కార్పొరేట్ల సిఎస్ఆర్ నిధులు రాకుండా చేశారు. తాజాగా పెంచిన పెట్రో సెస్సు వల్ల వచ్చే సొమ్ములో సైతం రాష్ట్రాలకు ఏమీ రాదు. గతి లేక, సొంతూళ్లకు వెడుతున్న వలస కూలీల రైలు ఛార్జీలను సైతం రాష్ట్రాల మీదకు తోసేశారు. మరోవైపు విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకు వస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దేశం కానీ దేశంలో నానాకష్టాలు పడుతున్న మన వారిని తీసుకు రావాల్సిన సమయంలో వారికి లక్ష రూపాయల టిక్కెట్ భారం...క్వారంటైన్‌లో సొంతఖర్చుల భారాన్ని మోపారు. లక్షలాదిగా వస్తున్న వీరి విషయంలో ఏం జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోంది. విమానాశ్రయాల్లో దింపేసి రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యతంటూ చేతులు దులుపుకుంటున్నారు. కేంద్ర సర్కారు ఏం చేయనుందన్నది దీంతో తెలిసిపోతున్నది. మొత్తంమీద లాక్‌డౌన్ ప్రకటించడం, ఆ తరువాత కార్పొరేట్ల సేవలో యథావిధిగా రుణాలను మాఫీ చేయడం మినహా మరోటి కానం లేదు. దీంతో రైతులతో పాటు, వ్యవసాయ కూలీలు ఆ రంగంపై ఆధారపడిన ఇతరుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. సాఫ్ట్‌వేర్‌తో పాటు ఇతర సేవా రంగాల పరిస్థితి కూడా నానాటికి తీసికట్టుగా మారుతోంది. ఈ సంక్షోభ కాలంలో సామాన్య పేదల చేతుల్లో డబ్బులుండటం కీలకం. కుటుంబానికి నెలకు కనీసం పది వేల రూపాయలన్నా ఇవ్వాలని, ఒక ఉద్దీపన ప్యాకేజిని ప్రకటించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా, జర్మనీ, బ్రిటన్ తదితర దేశాలు ఆ పని ఇప్పటికే చేశాయి. మనం అదే పని చేయడానికి కేంద్రం వద్ద వనరులూ ఉన్నాయి. కానీ, మోడీ ప్రభుత్వం నుంచి అలాంటి హామీలు రావడం లేదు. ప్రజలు దిక్కుదోచక తలలు పట్టుకుంటున్నా కేంద్రం తీసుకునే చర్యలు కానరాక ప్రజలు గందరగోళంలో పడుతున్నారు.

కరోనావ్యాప్తి నియంత్రణ చర్యల్లో జర్నలిస్టులు అందించిన సేవలు అమూల్యం

-కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి.బి. కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, మే 12(నేటినిజం ప్రతినిధి): కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణ చర్యల్లో జిల్లా ప్రభుత్వయంత్రాంగంతోపాటు జర్నలిస్టులు ప్రాణాలను సైతంలెక్కచేయకుండా అందించిన సేవలు అమూల్యమైనవని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులతో సమన్వయం కొనసాగిస్తూనే కరోనా వైరస్‌వ్యాప్తి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడూ ప్రపంచానికి తెలియజేయజేస్తూ అందరిదృష్టి కరీంనగర్ వైపు చూసేలా చేయడంలో మీడియా సఫలీకృతం అయిందని చెప్పారు.

కరోనావైరస్ వ్యాప్తితో నెలకున్న పరిస్థితులపై అంచనావేసి ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు తమవంతు సహాయంగా మంగళవారం నాడు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి జర్నలిస్టులకు నిత్యావసరవస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడుతూ అత్యవసరసేవలందించే వివిధ ప్రభుత్వశాఖలతో సమానంగా జర్నలిస్టులు కరోనావ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగస్వాములయ్యారన్నారు. ప్రభుత్వయంత్రాంగమే కాదు ఏరంగానికి చెందిన వారైనా మీడియా గుర్తింపులేనిది ప్రజల దృష్టికి చేరదని చెప్పారు. కరోనా వైరస్‌వ్యాప్తి నియంత్రణ చర్యల్లో నేడు కరీంనగర్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలవడంలో మీడియా తమవంతు పాత్రను పరిపూర్ణంగా పోషించిందని ప్రశంసించారు. ప్రజల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళడం, ప్రభుత్వయంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు అర్థమయ్యేతీరులో వివరించడం మీడియా ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

మొదటివిడతగా 100 జర్నలిస్టులకు నిత్యావసరవస్తువులను సరఫరా చేశారు. విడతలవారీగా మిగతావారికికూడా నిత్యావసరవస్తువులను అందజేస్తామని హామీఇచ్చారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీస్‌అండ్‌వెల్ఫేర్ కమిటి ఆధ్వర్యంలో వలస,దినసరి కార్మికులు, కడుబీదకుటుంబాలకు చెందిన 650 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరవస్తువులను పంపిణీచేయడంతోపాటు కమీషనరేట్‌వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎన్ శ్రీనివాస్(ఎల్అండ్ఓ), జి చంద్రమోహన్(పరిపాలన), కరీంనగర్ టౌన్ ఏసిపి వి అశోక్, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, దేవారెడ్డి, విజ్ఞాన్‌రావు, జర్నలిస్టుల ప్రతినిధులు గాండ్ల శ్రీనివాస్, గోపాలకృష్ణ, ప్రింట్‌అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం చేరుకోవాలి

అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలి

రాజకీయ విమర్శలు మానాలని బిజెపికి వేముల హితవు

నిజామాబాద్,మే12ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోళ్లు అనుకున్న విధంగా పూర్తి చేయాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ట్రాక్టర్లను వినియోగించి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రుణమాఫీకి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఆధార్ లింకు లేని వారికి వెంటనే అవకాశం కల్పించి లింక్ చేయాలన్నారు. వ్యవసాయ ఏఈవోల ఆధా రంగా నెంబర్‌లు తీసుకొని బ్యాంకర్‌లు ఆన్‌లైన్ చేయా లన్నారు. వచ్చే వానకాలం పంటలను దృష్టిలో పెట్టుకొని జులై నాటికి 75 శాతం ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఇదిలావుంటే బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ అదే పనిగా చేస్తున్న విమర్శలను కొట్టి పడేశారు. రైతులకు మేలు చేసే పని చేయాలన్నారు. విమర్శలతో రైతుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయరాదన్నారు. ఇకపోతే జిల్లాలో కరోనా కట్టడిలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా బాగా సహకరిస్తున్నారని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రీన్‌జోన్‌లోకి వెళ్లవచ్చాన్నారు. అప్పటి వరకు ప్రజలు లాక్‌డౌన్‌కు సహకరించాలన్నారు. జిల్లాలో కరోనా కట్టడికి ఇప్ప చాలా చేశామన్నారు. అదే స్ఫూర్తితో ముందుకు పోవాలన్నారు. ఈ సమస్య సమసిపోలేదన్నారు. ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరోనాపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లాక్‌డౌన్ నిబందనలు పాటించే విధంగా చూడాలన్నారు. ప్రజలు అవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రాకుండా స్వీయనియంత్రణ పాటించాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు కఠినంగా లాక్ డౌన్‌ను అమలుచేయాలన్నారు. ఇదే రీతిలో కొనసాగి స్తే గ్రీన్‌జోన్‌లోకి వెళతామన్నారు. నిత్యావసర వస్తువులు, మాంసం, కూరగాయలు అమ్మే దుకాణాలతో పాటు ఇతర దుకా ణాల వద్ద మాస్కులు, గ్లౌజులు ధరించే విధంగా చూడాలన్నారు. భౌతిక దూరం పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముంబై, ఔరంగాబాద్, నాగ్‌పూర్ నుంచి వచ్చే వారి లిస్టును ప్రత్యేకంగా తయారుచేయాలన్నారు. వారిని హోంక్వారంటైన్‌లో ఉంచాలన్నారు. ఆశ వర్కర్‌లు, ఏఎన్ఎంలు విధిగా వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించా లన్నారు.

కరోనా సోకిన వారిపట్ల వివక్ష కూడదు

వైరస్ పట్ల భయాందోళనలు తొలగించాలి

కరోనా సమీక్షలో సిఎం జగన్ సూచన

అమరావతి,మే12(ఆర్ఎన్ఎ): వైరస్ సోకిన వారి పట్ల వివక్ష చూపడం సరికాదని ఆంధ్రప్రదేశ్

జిల్లాల్లో పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు

ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్న ప్రజలు

ఎండవేడిమికి అల్లాడుతున్న జనం

వరంగల్,మే12ఆర్ఎన్ఎ): ఉత్తర తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఆదిలాబాద్,వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో గత రెండుమూడు రోజులుగా ఎండవేడిమి పెరిగింది. రోహిణి దగ్గర పడుతున్నా కొద్ది ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడి తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇన్నాళ్లు ఇంటికే పరిమితమైన ప్రజలు లాక్‌డౌన్ ఆంక్షలు సడలించడంతో ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారు. కరోనా వైరస్ కట్టడి విధుల్లో ఉన్న పోలీసులు, ఇతర సిబ్బంది గొడుగు సహాయంతో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. అయితే వేసవి పరిస్థితుల నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేసుకునేందుకు లాక్‌డౌన్ ఆంక్షలతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ఎండ తాపానికి శీతల పానీయాలు దొరకడమే గగనంగా మారింది. అలాగే మూగజీవాలు చెట్ల నీడన సేద తీరుతున్నాయి. కరోనా దెబ్బకు కుదేలైపోయిన వలస కూలీలు జిల్లా మీదుగా మండుటెండలోనే స్వస్థలాలకు కాలినడకన దయనీయ పరిస్థితుల్లో వెళుతున్నారు. మరికొన్నాళ్లు వడగాలుల ప్రభావం ఉంటుందని ముందు జాగ్రత్తలే ముఖ్యమంటూ వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. దీంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మే ప్రారంభమైనప్పటి నుంచి ఎండల తీవ్రత పెరుగుతోంది.గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటుతోంది. లాక్‌డౌన్‌తో ప్రజలు పెద్దగా ఇళ్ల నుంచి బయటకు రాకపోవడంతో పెద్దగా ప్రభావం తెలియడం లేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు తెరవడంతో పాటు, కార్యకలాపాలు మొదలు కావడంతో ప్రజలు మెల్లగా బయటకు వస్తున్నారు. మండుతున్న ఎండలకు చిరు వ్యాపారులు, రైతులు, దినసరి కూలీలు, ఉపాధి కూలీలు అల్లాడుతున్నారు. అయితే అక్కడక్కడా వర్షాలు పడుతున్నా మరునాడు మళ్లీ ఎండవేడిమి ప్రభావం చూపుతోంది. పగలంతా ఎండలతో మండిపోతున్న రాత్రి వేళల్లో తీవ్రమైన వడగాలుల ప్రభావం కనిపిస్తోంది. మండుతున్న ఎండలకు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు మొరాయించడంతో గృహ వినియోగ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వడగాలుల బారిన పడితే ప్రాణాలకే ముప్పు పొంచి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర సమయంలోనైతే తప్ప బయటకు వెళ్లవద్దంటూ సూచిస్తున్నారు. ఇకపోతే కొన్ని రోజులుగా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం సూర్యుడు అస్తమించే వరకు పగలంతా భగభగలతో ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నా సాయంత్రం వేళల్లో ఈదురు గాలుల ప్రభావానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతోంది. లాక్‌డౌన్ ఆంక్షల కారణంగా రాత్రి 7గంటలు దాటిందంటే పో లీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఎక్కువమందికి ఉపాధి కల్పించాలి

–కరోనా రక్షణ చర్యలు తప్పనిసరి: ఎర్రబెల్లి

హైదరాబాద్,మే12(ఆర్ఎన్ఎ): వీలయినంత ఎక్కువ మంది కూలీలకు ఉపాధి కల్పించాలని, కొత్తగా వస్తున్న కూలీలకు జాబ్ కార్డులు జారీ చేయాలని, అధికారులను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు.రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు, కూలీలకు ఉపాధి కల్పన, కరోనా, వేసవి నేపథ్యంలో కూలీల భద్రత, నర్సరీలు, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు, వైకుంఠ ధామాలు తదితర అంశాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సగటున ప్రతి గ్రామ పంచాయతీ నుంచి 182 మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. అలాగే ప్లలె ప్రగతి, నర్సరీల్లో మొక్కల పెంపకం, ఇంకుడు గుంతలు వైకుంఠ ధామాల నిర్మాణ పనులను పురోగతిపై సమీక్షించారు. కరోనా నివారణలో భాగంగా అన్ని రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

కష్టకాలంలోనూ రైతులకు ఆసరా

నిధులు విడుదల చేసి పెద్ద మనసు చాటుకున్న కెసిఆర్

సమీక్షలో మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్,మే12(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దనే లక్ష్యంతో రైతుబంధు కోసం రూ. 7వేల కోట్లు కేటాయించారని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రైతుబంధు, రుణవిమోచనకు నిధులు విడుదల చేయడం సామసోపేతం అన్నారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా రైతాంగ సమస్యలు, రైతుబంధు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, విత్తనాలు, ఎరువులు, ఫెస్టిసైడ్స్ లభ్యత–పంపిణీ, మిషన్ భగీరథ, తెలంగాణ సన్న రకాల పంటల ప్రోత్సాహంపై జిల్లా యంత్రాంగం, జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోతు బిందుతో కలిసి సమీక్ష నిర్వహించారు.అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ప్రతి ఇంటికి మంచినీరు అందాలని ఏ ఒక్క మహిళ బిందె పట్టుకొని బయటకు రాకుండా మిషన్ భగీరథ నీళ్లు అందేలా అధికారులు చూడాలన్నారు. వరి, మక్కల కొనుగోళ్లలో సేకరించిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. తక్కువ ఖర్చుతో, ఎక్కువ దిగుబడి ఇచ్చే తెలంగాణ సన్న రకాలను పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు.

రైతులను మోసం చేస్తున్నారన్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శకంర్ నాయక్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దొరల కాలం ఇంకెంత కాలం నడుస్తదో తెలియదు అంటూ వ్యాఖ్యానించారు. తాను ఏం మాట్లాడినా తప్పే అంటారని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి రైతుల మీటింగ్‌లో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే... జిల్లా కేంద్రంలో ప్రధాన కార్యాలయాలు ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏం రాజ్యాంగమో.. ఎవరు కనిపెట్టారో తెలియదు కానీ.. అన్నం పెట్టే రైతుకు ప్రతిసారి అన్యాయమే జరుగుతుందన్నారు. అన్నం లేకుంటే బతకలేరు అని, ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ తెలుసునని, అన్నం పెట్టే రైతును మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. రైతులను మోసం చేయడం ఎంత దుర్మార్గమో అని, అలాంటి వారికి ఉరి శిక్ష విధించాని అన్నారు. గుండు పిన్ను నుంచి వస్తువులను తయారు చేసే వారే ధరలను నిర్ణయిస్తారని, రైతులకు మాత్రం ఆ అవకాశం లేదని ఎమ్మెల్యే శంకర్ నాయక్ పేర్కొన్నారు. కాగా, శంకర్ నాయక్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో మంత్రి సత్యవతి రాథోడ్ పక్కనే ఉన్నారు.

కరోనా కేసులు పెరుగుతున్నాయ్

వలస కూలీల తరలింపు సరికాదు

ఢిల్లీలో ఉన్న వారు ఇక్కడే ఉండాలి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ,మే11(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో కూడా ఏడు వేలకు పైగానే కరోనా కేసులు నమోదై ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా ఉన్న వలస కార్మికులు తమ స్వస్థలాలకు వెళ్లాలని ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం వలస కార్మికుల విషయంలో తీసుకున్న నిర్ణయం వృదా అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. ఈ సందర్భంగా దేశ రాజధానిలో ఉన్న వలస కార్మికులు ఢిల్లీలోనే ఉండాలని కోరారు. ఇదే సమయంలో కాలినడకన వారివారి ప్రదేశాలకు వెళ్లవద్దని అన్నారు. వలస కార్మికుల కోసం మరిన్ని రైలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వలస కార్మికుల విషయంలో ఢిల్లీ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరిని జాగ్రత్తగా చూసుకుంటామని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. 75 శాతం వరకూ నమోదైన కేసుల విషయంలో ప్రమాదం లేదని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు. చాలావరకు కరోనా వైరస్ పాజిటివ్ లక్షణాలు కలిగి ఉన్నారు ప్రమాదం లేని వ్యాధిగ్రస్తులను ఇంటిలోనే ఉంచి చికిత్స అందిస్తున్నట్లు కేజ్రీవాల్ తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీని కరోనా వైరస్ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుం డటంతో ఢిల్లీ ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఢిల్లీలో కేవలం 1000 పాజిటివ్ కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. సరిగ్గా నెల రోజుల కాలంలో ఆ కేసుల సంఖ్య 7 వేలకు పైగా చేరింది. గత పది రోజుల నుంచే పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఆదివారం ఒక్కరోజే ఢిల్లీలో 310 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 63 మంది కరోనా బాధితులు ఈ వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. కరోనా కేసుల్లో మూడో స్థానంలో నిలిచిన ఢిల్లీలో ఇప్పటి వరకు 7,233 పాజిటివ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ వైరస్ నుంచి కోలుకుని 2,129 మంది డిశ్చార్జి కాగా, 73 మంది ప్రాణాలు కోల్పోయారు. ఢిల్లీలో సడలింపులు ఇచ్చిన తర్వాతే కరోనా కేసుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

ఉద్యోగుల రాకతో కార్యాలయాలకు కళ

ఆదాయం వచ్చే శాఖలపైనే ప్రధాన దృష్టి

రవాణా సౌకర్యం లేక అతి తక్కువగా ఉద్యోగుల హాజరు

హైదరాబాద్,మే12(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో పాక్షికంగా పనిచేసిన ప్రభుత్వ కార్యాలయాలు తాజాగా పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించాయి. కేంద్రం గ్రీన్, ఆరెంజ్ జోన్లలో పూర్తిస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడానికి అనుమతించడంతో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, ప్రైవేట్ కార్యాలయాలు మొదల య్యాయి. అయితే ప్రజారవాణా లేనందువల్ల అనేక చోట్ల ఉద్యోగుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. బస్సుల్లో వచ్చే ఉద్యోగులు మాజరు కావడం లేదు. సొంత వాహనాలు ఉన్నవారు, ప్రభుత్వం కల్పిస్తున్న రవాణా సదుపాయంతో మాత్రమే కొందరు ఉద్యోగులు హాజరవుతున్నారు. ప్రధానంగా ఆదాయంతో ముడిపడివున్న సబ్ రిజిస్ట్రార్ లాంటి కార్యాలయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గ్రీన్, ఆరెంజ్ జోన్లలోని ప్రభుత్వ కార్యాలయాలకు పూర్తిస్థాయిలో, రెడ్‌జోన్లలో 33 శాతం సిబ్బంది హాజరు కావాలని తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్, ఆరెంజ్ జోన్లలో పూర్తిస్థాయిలో హాజరై విధులు నిర్వర్తిస్తున్నారు. లాక్‌డౌన్‌లో వైద్య ఆరోగ్యసిబ్బంది, పోలీసులు, మున్సిపల్, పారిశుద్ధ్య, రెవెన్యూ, గ్రామపంచాయతీ, విద్యుత్ విభాగాల అధికారులు, సిబ్బంది సెలవులు లేకుండా పనిచేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో వ్యవసాయ, మర్కెటింగ్, పౌరసరఫరాలశాఖల సిబ్బంది గ్రామాలకే వెళ్లి పంటలను కొంటున్నారు.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఆర్టీఏ కార్యాలయాలు కూడా పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. రెడ్‌జోన్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, సూర్యాపేట, వరంగల్ అర్బన్ జిల్లాలున్నాయి. కొన్ని రోజులుగా సూర్యాపేట, వరంగల్ అర్బన్ జిల్లాలో కొత్త కేసులు నమోదు కావడంలేదు. ఈ రెండు జిల్లాలను రెడ్‌జోన్ నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అందరూ మాస్కులు ధరించి విధులకు హాజరవుతున్నారు. సరైన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేక ఉద్యోగులు అనుకున్న మేర రాలేకఎ తున్నారు. అయినా జిల్లాల్లో ఆయా కార్యాయాలకు పూర్తి స్థాయిలో సిబ్బంది హాజరై విధులు నిర్వహించడం ఆరంభించారు. అత్యవసర విభాగాలు మినహా మిగతా విభాగాల కార్యాలయాలకు సిబ్బంది విడతల వారీగా 20 శాతం మాత్రమే హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలతో కార్యాలయాలు కళకళలాడాయి. రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్‌తో పాటు వివిధ కార్యాలయాలు, బీమా కంపెనీలైన ఎల్ఐసీ, చిట్ ఫండ్ కంపెనీలు ప్రజలతో కిటకిటలాడాయి. భౌతిక దూరం, మాస్కులు ధరించి కార్యాలయాల్లో పనులు పూర్తి చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం క్లయింట్లతో మళ్లీ పాత కళను సంతరించుకుంది. పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటిస్తూ కార్యకలాపాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు అత్యవసర సర్వీసులకు మాత్రమే అనుమతి ఉన్న విషయం తెలిసిందే. ర్యాలయాల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విక్రయాలు, ఈసీలు తదితర సేవలు అందుతున్నాయన్నారు. వైబ్‌సైట్‌లో వివరాలు నమో దు చేయడంతోపాటు స్టాంపుడ్యూటీ తదితర ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించి, రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ లో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీల్లో కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకున్న సమయంలోనే సంబంధిత కార్యాలయానికి వెళ్లేందుకు అవసరమైన పాస్ సైతం ఆన్‌లైన్‌లో లభిస్తుంద న్నారు. ఈసీ, దస్తావేజు నకలు మీసేవ కేంద్రాల నుంచి పొందాలని లేదా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. కరోనా నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జాగ్రత్తలు తీసుకుం టున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలన్నారు. ఇకపోతే బ్యాంకుల వద్ద జనం బారులు తీరుతున్నారు. పింఛన్ల సొమ్ము, నిత్యావసరాల సరుకుల కోసం ప్రభుత్వం జమ చేసిన సొమ్ము, ధాన్యం డబ్బుల కోసం వస్తున్న వారితో బ్యాంకులు రద్దీగా మారాయి. అయితే బ్యాంకుల ముందు భౌతిక దూరాన్ని పాటించకపోవడంతో చాలా మంది మాస్కులు ధరించడం లేదు.

కరోనా కట్టడిలో సిఎం కెసిఆర్ దూరదృష్టి

పంటల కొనుగోలులోనూ ఆదర్శంగా తెలంగాణ

ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

వరంగల్,మే12(ఆర్ఎన్ఎ): కరోనా కట్టడిలో తెలంగాణ సర్కారును ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నా యని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. అలాగే లాక్‌డౌన్ పీరియడ్‌లోనూ ధాన్యం కొనుగోళు చేపట్టి సిఎం కెసిఆర్ దేశానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్,బిజెపిలు విమర్శలు మాని గ్రామాల్లో పరిస్థితిని చూడాలన్నారు. దేశంలో లాక్‌డౌన్‌కు వారం రోజుల ముందే వలసకూలీలను వారి స్వస్థలాలకు పంపించడంలో కేంద్రం విఫలమైందని, వారిని ఆదుకునేందుకు కమిటీ వేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ పాలన చూసి ఓర్వలేకే విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. అన్నదాతల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని అన్నారు. కరోనా విపత్తు వేళ జిల్లా ప్రజలకు సిఎం కెసిఆర్ అన్నివిధాలా అండగా నిలిచారని అన్నారు. కరోనా వైరస్ కట్టడిలో సేవలందిస్తున్న అత్యవసర సిబ్బందిలోనూ ఆయన భరోసా నింపడంతోపాటు, వలస కూలీలకు ఆపద్బాంధవుడిలా మారారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న అత్యవసర సేవల సిబ్బందికి అండగా నిలిచారు. వైద్యులు, సిబ్బందికి పీపీఈ కిట్లు, ఇతర సామగ్రి కొరత లేకుండా చేశారు. వైద్య, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల కిందిస్థాయి సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేదలకు జిల్లా టీఆర్ఎస్ శ్రేణులు, దాతలు పెద్దఎత్తున నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విరాళాలు అందజేశారు. కష్టకాలంలో ఆందోళన చెందుతున్న రైతులకు అండగా నిలిచి, పంటకొనుగోళ్లను పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా జిల్లాల్లో రికార్డుస్థాయిలో పంట కొనుగోళ్లు జరిగాయన్నారు. లాక్‌డౌన్‌తో ఇక్కడ ఉండలేక స్వస్థలాలకు వలసబాట పట్టిన వలస కూలీలు, కార్మికులకు తానున్నానని ముఖ్యమంత్రిభరోసా కల్పించారు. అన్నం దొరకక కాలే కడుపులతో ..రవాణా సౌకర్యం లేక చంటి పిల్లలను చంకనెత్తుకొని వందల కిలోమీటర్ల దూరం కాలినడకన పయనమైన వారిని అక్కున చేర్చుకున్నారు. వలస కూలీలకు అన్నం పెట్టి, ప్రత్యేక వాహనాల్లో వారిని తీసుకెళ్లి రాష్ట్ర సరిహద్దుల వద్ద దిగబెడుతున్నారు. ఇంతకన్నా ఆదరణ కల్పిస్తున్న రాష్ట్రం మరోటి ఉండదన్నారు.

నిజామాబాద్ జిల్లాలో తగ్గుతున్న కరోనా ప్రభావం

ప్రజల బాగస్వామ్యంతో సాధారణ స్థాయికి పరిస్థితి

అయినా అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్

నిజామాబాద్,మే12ఆర్ఎన్ఎ): జిల్లాలో అందరి సహకారం వల్లనే కరోనా కట్టడి సాధ్యమైందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మే 29 వరకు ఇదే రీతిలో కొనసాగిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండవని ఆయన తెలిపారు. వైరస్ ఏ విధంగానైనా వ్యాప్తి చెందవచ్చునని అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. లాక్‌డౌన్ సడలింపులతో వ్యాపార, వాణిజ్య కార్యక్రమాలకు అవకాశం రానుంది. లాక్‌డౌన్ మే 29 వరకు కొనసాగుతున్నందున రాత్రివేళల్లో మాత్రం కర్ఫ్యూ కొనసాగిస్తున్నారు. ప్రజలెవరూ బయటకు రాకుండా చూస్తున్నారు. పగటి వేళలో కూడా అవసరం ఉన్న వారిని రావాలని కోరుతున్నారు. మాస్కులు ధరించని వారిపై చర్యలను తీసుకుంటున్నారు. జరిమానాలు విధిస్తున్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిదులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్ల కరోనా ప్రభావాన్ని తగ్గించారు. ఇదే రీతిలో నెలాఖరు వరకు కొనసాగిస్తే కరోనాను మరింత తగ్గించనున్నారు. కరోనా తీవ్రత నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన కారణంగా జిల్లాలో అన్ని వ్యవస్థలూ అతలాకుతలమయ్యాయి. వ్యాపార లావాదేవీలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. చిరువ్యాపారులు దెబ్బతి న్నారు. కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. భవన నిర్మాణంతో పాటు ఇతర రంగాలలో పనిచేస్తున్న వారికి ఉపాధి లేకుండా పోయింది. వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కూలీలకు మాత్రం ఉపాధి దొరికింది. 45 రోజుల తర్వాత కేంద్ర ప్రభుత్వం సడలింపులు ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని మినహాయింపులు ఇచ్చింది. బీ కేటగిరి కింద ఉన్న దుకాణాలను రోటేషన్ పద్ధతిలో తెరుచుకునేందుకు అవకాశం ఇచ్చారు. గడిచిన నాలుగు రోజులుగా మున్సిపల్ అధికారులు సరి, బేసి సంఖ్యలో అనుమతులు ఇవ్వడంతో షాపులను తెరుస్తున్నారు. మరో వారం రోజులు గడిస్తే గాని కొద్దిమేరకు గాడిన పడే అవకాశం ఉంది. మే 17 తర్వాత సమీక్షించి మరికొన్ని సడలింపులు రానున్నాయి. మే 29 వరకు లాక్‌డౌన్ కొనసాగినా ఆ లోపు షాపులను తెరుస్తూ వ్యాపారం పుంజుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగానే జిల్లాలో వ్యాపార, వాణిజ్య రంగం మెరుగుపడే అవకాశం ఉంది. దీంతో సామాన్యులతో పాటు ఇతరులు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. లాక్‌డౌన్ పూర్త యితే కొద్దిమేరకు ఊరట చెందే అవకాశం ఉంది. జిల్లాలో కరోనా తీవ్రత తగ్గుతూ వస్తోంది. ఆరెంజ్ జోన్ నుంచి గ్రీన్ జోన్‌గా మారేందుకు అవకాశం ఏర్పడుతోంది. తొలి దశలో హైదరాబాద్ తర్వాత జిల్లాలోనే కరోనా ఉధృతంగా వ్యాప్తి చెందింది. దీంతో అధికారులు వెంటనే జిల్లాలో కట్టడి ప్రాంతాలను ఏర్పాటు చేయడంతో కమ్యూనిటికి వ్యాపించలేదు. ప్రజలు స్వీయ నియంత్రణ పాటించడం వల్ల వైరస్ వ్యాప్తి చెందలేదు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు, అందించిన సేవల వల్ల కరోనా ప్రభావం తగ్గుతూ వచ్చింది. క్వారంటైన్‌లు, ఐసోలేషన్‌లో ఉన్న వారితో పాటు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు కూడా డిశ్చార్జి అయి ఇళ్లకు చేరుతున్నారు. ప్రస్తుతం కేవలం ఐదుగురు మాత్రమే చికిత్స పొందుతున్నారు. వారు కూడా డిశ్చార్జి అయితే జిల్లా కరోనా ఫ్రీగా మారనుందన్నారు.

కరోనాతో పెరగనున్న పెండింగ్ కేసుల సంఖ్య

వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అత్యవసర కేసుల విచారణ

న్యూఢిల్లీ,మే12(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నేపథ్యంలో కోర్టులు కేవలం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాత్రమే అత్యసవర కేసులను విచారిస్తున్నాయి. ఇందులో అత్యధికం ప్రభుత్వ సంబంధమైనవే ఉంటున్నాయి. దీంతో సామాన్యులకు సంబంధించిన కేసులు మరుగున పడ్డాయి. జైళ్లలో బెయిల్ దొరక్క మగ్గుతున్న వారు కోకొల్లలుగా ఉన్నారు. వారంతా లాక్‌డౌన్ కారణంగా అక్కడికే పరిమితం అయ్యారు. అంతుచిక్కని వైరస్ మనను, మన చుట్టూ వున్న సమాజాన్ని, వ్యవస్థలను అదే విధంగా ప్రపంచ గమనాన్ని మార్చివేసింది. దీంతో నిత్యం ప్రజలతో కిటకిటలాడే కోర్టులు నేడు వెలవెలబోతున్నాయి. న్యాయవ్యవస్థ మాత్రం అన్ని కాలాలలోనూ, విభిన్న పరిస్థితులలోనూ లేదా వివత్కర పరిస్థితులలోనూ పనిచేస్తుంది.

కానీ గత రెండునెలలుగా భారతదేశ న్యాయవ్యవస్థ సుశుప్తావస్థ లోకి నెట్టబడింది. ఎమర్జెన్సీ రోజులలో సైతం మన దేశంలోని న్యాయస్థానాలు పనిచేశాయి. నిరంతరం పరిశుభ్రత పాటిస్తూ..చేతులు కడుక్కోవటమే కాక మన శరీర ఉష్ణోగ్రత పెరిగితే చాలు భయపడాల్సిన స్థితికి వచ్చాం.ఈ స్థితి ఎప్పటి వరకు కొనసాగుతుందనేది చెప్పలేని స్థితిలో ఉన్నాం. లాక్‌డౌన్ ఎత్తేసినా మునుపటి స్థాయిలో కోర్టు కార్యకలాపాలు సాగుతాయా అన్నది చూడాలి. మే మాసం కావడంతో సహజంగానే వేసవి సెలవుఉల వస్తాయి. జూన్ తరవాతనే ఇక కోర్టులు పనిచేయగలవని అంటున్నారు. ఈ పరిస్థితుల ప్రభావ కారణంగా మార్చి చివరి వారం నుంచి న్యాయస్థానాల పని కుంటుపడింది. దీంతో రాష్ట్రం లేదా దేశ ఉన్నత న్యాయస్థానాలలో ఉన్న కేసులు అనేకం పెండింగ్‌లో పడ్డాయి. ఈ కేసుల పరిష్కారానికి రాగల 50 లేదా 60 సంవత్సరాలు పట్టవచ్చు. ఎందుకంటే ప్రతి సంవత్సరం కొత్త కేసులు వస్తుంటాయి. లా–కమిషన్ దేశంలో 10 లక్షల జనాభాకు 50 న్యాయస్థానాలు ఉండాలని సూచించింది. కానీ ఇప్పటికి కూడా మన దేశంలో 10 లక్షల ప్రజానీకానికి 35 న్యాయస్థానాలు మాత్రమే ఉన్నాయి. ఇక ఉన్న కోర్టులలో కనీసం 35 శాతం న్యాయమూర్తుల, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థితిలో అనేక కేసులు పెండింగ్‌లో ఉండగా,కరోనా ప్రభావంతో కేవలం అర్జంట్ కేసులను విచారించడం వలన ఇప్పటికే ఫైల్ అయి వున్న కేసులు పరిష్కరించడానికి ఇంకా సమయం పడుతుంది. దేశంలోని అన్ని హైకోర్టులలో 35 శాతం జడ్జిల నియామకాలు కూడా జరగాల్సి ఉందని అంటున్నారు.గత రెండు దశాబ్దాలుగా ఈ సమస్య ఉదంటున్నారు. అందుకే నేషనల్ జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్‌గా చాలా సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నది. ఇటువంటి ఇబ్బందులకు తోడు ఇప్పటి కరోనా ప్రభావం న్యాయ వ్యవస్థపై పడింది. మార్చి 15 నాటి నుంచి వేయవలసిన కేసులు కోర్టులు తెరవని కారణంగా తిరిగి కోర్టులు పూర్తి స్థాయిలో తెరుచుకొన్న తరువాత వేసుకోవచ్చునని గౌరవ సుప్రీంకోర్టు ఆర్డర్ జారీ చేసింది. ఈ కారణంగా చాలా సివిల్ కేసులలో కక్షిదారులు నష్టపోతున్నారు. న్యాయస్థానాలు గతంలో చేసిన పని కంటే ఎక్కువ గంటలు పని చేసే అవకాశం లేదు. మాస్కులు పెట్టుకున్నప్పటికీ, వ్యక్తిగత, భౌతిక దూరం పాటించడానికి ప్రయత్నించి నప్పటికీ, కరోనా ప్రభావం ఎంతో కొంత ప్రమాదకరంగానే ఉంటుంది. న్యాయస్థానాల నిర్వహణ కూడా ప్రశ్నార్థకం అవుతున్నది. కోర్టులలోకి ప్రవేశాన్ని తగ్గించేలా చర్యలుండాలి. కక్షిదారుల వ్యక్తిగత హాజరును మినహాయించేలా చర్యలు తీసుకోవాలి.

ప్యాసింజర్ రైళ్లకు అనుమతి వద్దు

తమిళనాడు సిఎం పళనిస్వామి వినతి

చెన్నై,మే12(ఆర్ఎన్ఎ): మే 31వ తేదీ వరకు ప్యాసింజర్ రైలు సర్వీసులు తిరగడాన్ని వ్యతిరేకిస్తున్నామని తమిళనాడు సీఎం పలనిస్వామి ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలిపారు. కరోనావై

సమగ్ర వ్యవసాయ విధానాన్ని తీసుకొస్తాం

మహబూబ్‌నగర్, మే 12 : వచ్చే యాసంగి నాటికి రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ విధానాన్ని తీసుకువస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర మండల కేంద్రంలో రూ. 3 కోట్ల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ గోదామును, చిన్నచింతకుంట మండలం బండర్ వల్లి గ్రామంలో రూ. 3 కోట్లతో నిర్మించిన మార్కెట్ గోదామును మంత్రి ప్రారంభించారు. లాల్కోట గ్రామ సమీపంలోని బంద్రవల్లి వాగుపై సుమారు రూ. 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న చెక్ డ్యామ్ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ విధానం తీసుకువచ్చేందుకు సీఎం కేసీఆర్ శాస్త్రవేత్తలు, అధికారులు ,రైతులు, ఇతరులతో కసరత్తు ప్రారంభించారని తెలిపారు. ఈ విషయమై సీఎం త్వరలోనే రైతులు, రైతుబంధు సభ్యులు, శాస్త్రవేత్తలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో సన్న వడ్లు, కంది, వేరుశెనగ విస్తీర్ణం పెంపుదల, ఆయిల్ పామ్ తోటల పెంపకం తదితర విషయాలపై చర్చలు జరుగుతున్నాయని.. అంతిమంగా రైతుకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 40 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు ఉండగా, వచ్చే యాసంగి నాటికి మరో 40 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములు ను నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన వెల్లడించారు. శ్రీశైలం జలాశయం నుంచి మూడు టీఎంసీల నీటిని ఎత్తి పోసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో ఏక పక్షమని ,రాష్ట్ర ప్రభుత్వం దీనిని వ్యతిరేకిస్తున్నదని, ఈ విషయంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ధాన్యం,పల్ల కొనుగోళ్లలో మహిళలే కీలకం

వారి ద్వారానే పల్లు కొనుగోలు చేయాలి

సెద్దపహాడ్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి

జనగామ,మే12(ఆర్ఎన్ఎ): ధాన్యం, మామిడి కొనుగోళ్లలో మహిళలదే కీలకపాత్ర అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రజలు ఐకెపి ద్వారా అమ్ముడయ్యే పండ్లను వినియోగించాలని ఎర్రబెల్లి కోరారు. జిల్లాలోని పెద్దపహాడ్‌లో మామిడికాయల మార్కెట్ ను మంత్రి ఇదిలావుంటే పాలకుర్తి నియోజకవర్గంలో టీఆర్ఎస్ సౌతాఫ్రికా శాఖ ఎన్నారైలు కరోనా విపత్కర పరిస్థితుల్లో నిరు పేదలకు మేమున్నామంటూ ముందుకొచ్చారు. పలు తండా వాసులు, వివిధ గ్రామాల్లోని ప్రజలకి మాస్కులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే పంచాయతీరాజ్

జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రామంలో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.

ఎర్రబెల్లి దయాకర్ రావు మంగళవారం ప్రారంభించారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఐకెపి మామిడి కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు. 3 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలనేది సెర్ప్ లక్ష్యమన్నారు. మామిడి కొనుగోలు కోసం 13 కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇప్పటికే ఖమ్మం, నాగర్ కర్నూల్, సిద్దిపేట, వికారాబాద్, జిగిత్యాలలో ఈ కేంద్రాలను ప్రారంభించామని చెప్పారు. రాష్ట్రంలోని మిగితా చోట్ల త్వరలోనే మామిడి కొనుగోళ్లను ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 300 మెట్రిల్ టన్నుల మామిడి కొనుగోలు పూర్తి చేశామన్న మంత్రి తెలంగాణలో పుచ్చు, అరటి, బొప్పాయి, పండ్లను కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో రసాయనాలు వాడకుండా పండ్లను సహజంగా మాగబెడుతున్నామని సూచించారు.

పాలకుర్తిలో మాస్కుల పంపిణీ

శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు. అలాగే నిరుపేదలు, వలస కూలీలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పోలీసులకు శానిటైజర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా సౌతాఫ్రికా ఎన్నారైలు తమ వంతు సాయం అందించేందుకు ముందుకొస్తామని తెలిపారు.

కరోనా వైరస్ సంక్షోభం ఉన్నప్పటికీ

2020 మొదటి త్రైమాసికంలో పటిష్ఠంగా లానెక్సెస్

హైదరాబాద్, మే, 12 – కరోనావైరస్ మహమ్మారి కారణంగా బలహీనమైన ఆర్థిక వాతావరణం ఉన్నప్పటికీ, స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లానెక్సెస్ ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో దృఢంగా నిలబడింది. న్యూ కన్స్యూమర్ ప్రొటెక్షన్ విభా గం మరియు స్పెషాలిటీ ఆడిటివ్స్ విభాగంలో ఆదాయాలు సానుకూలంగా అభివృ ద్ధి చెందాయి, కరోనావైరస్ సంక్షోభం ప్రభావాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. ఎక్స్ఛేంజ్ రేట్ ఎఫెక్ట్స్, ముఖ్యంగా యు.ఎస్. డాలర్ నుండి చోటు చేసుకున్నవి కూడా సాను కూల ప్రభావం చూపాయి. దీనికి విరుద్ధంగా, కరోనావైరస్ సంక్షోభం ఫలితంగా ఆటోమోటివ్ పరిశ్రమ నుండి డిమాండ్ మరింత క్షీణించడం ఆదాయాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది, మరీ ముఖ్యంగా ఇంజనీరింగ్ మెటీరియల్స్ విభాగంలో.

2020 మొదటి త్రైమాసికంలో ఈబీఐటీడీఏ ముందస్తు మినహాయింపులు 9.9 శాతం తగ్గి, 272 మిలియన్ల నుండి 245 మిలియన్ల యూరోలకు తగ్గాయి. ఈబీఐటీడీఏ మార్జిన్ ప్రీ మినహాయింపులు అంతకుముందు త్రైమాసికం నాటి 15.7 శాతం పోలిస్తే, ఆ తరువాత 14.4 శాతంగా ఉన్నాయి.

మొత్తం గ్రూప్ అమ్మకాలు 2020 మొదటి త్రైమాసికంలో 1.704 బిలియన్ యూరో లుగా ఉన్నాయి, అంతకుముందు సంవత్సరం మొత్తం 1.738 బిలియన్ యూరోల తో పోలిస్తే కొద్దిగా మాత్రమే తగ్గాయి. నిరంతర కార్యకలాపాల నుండి నికర ఆదాయం 27.6 శాతం తగ్గి, 87 మిలియన్ల నుండి 63 మిలియన్ల యూరోల ంగా నమోదైంది. రెండో, మూడో త్రైమాసికాల్లో, కరోనావైరస్ మహమ్మారి ప్రభావం తీవ్రతరం అవుతుందని లానెక్సెస్ భావిస్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, రెండో త్రైమాసికంలో ఈబీఐటీడీఏ ప్రీ మినహాయింతపులు 200 మిలియన్ల యూరోల నుండి 250 మిలియన్ల యూరోల మధ్య ఉంటాయని కంపెనీ భావిస్తోంది. 2020 మొత్తానికి చూస్తే, ఈబీఐటీడీఏ ముందస్తు మినహాయింపులు 800 మిలియన్ల యూరోల నుండి 900 మి లియన్ల యూరోల వరకు ఉండవచ్చునని లానెక్సెస్ ఇప్పుడు భావిస్తోంది. గతంలో వార్షి క ఆదాయం 900 మిలియన్ యూరోల నుంచి నుండి 1 బిలియన్ యూరోల వరకు ఉం డగలదని ఈ సంస్థ గతంలో భావించింది. మునుపటి సంవత్సరంలో, లానెక్సెస్ 1.019 బిలియన్ల యూరోల మేరకు ఈబీఐటీడీఏ ప్రీ మినహాయింపులను జనరేట్ చేసింది.

కరోనావైరస్ సంక్షోభం కోసం విస్తృతమైన చర్యల ప్యాకేజీ

కరోనావైరస్ సంక్షోభం ప్రారంభంలోనే, అప్పటికే సంస్థపై ప్రభావాన్ని తగ్గించడానికి లానెక్సెస్ అనేక రకాల చర్యలు తీసుకుంది. ఉద్యోగుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చింది. కఠినమైన పరిశుభ్రత నిబంధనలు, మెజారిటీ కార్యాలయ ఉద్యోగులకు ఇంటి నుండి పని చేయడానికి పరిష్కారాలు మరియు షిఫ్ట్ మోడల్‌లో మార్పులు వంటి రక్షణాత్మక చర్యలను ఉపయోగించి, లానెక్సెస్ ఉద్యోగులలో సంక్రమణ రేటు తక్కువగా ఉంచబడింది. ఇప్పటివరకు, ప్రపంచవ్యాప్తంగా 31 మంది ఉద్యోగులు కరోనా వైరస్ బారిన పడ్డారు – వారిలో 27 మంది ఇప్పటికే కోలుకున్నారు. ఇప్పటికే బాగా ఉన్న ద్రవ్యలభ్యత పరిస్థితిని ఈ స్పెషాలిటీ కెమికల్స్ సంస్థ మరింత బలోపేతం చేయడానికి కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకుంది.

కరోనా నివారణ చర్యల్లో రాజీలేదు

కరోనా బాధితులకు అత్యుత్తమ సేవలు అందాలి

అధికారులతో సిఎం కెసిఆర్

హైదరాబాద్,మే12(ఆర్ఎన్ఎ): కరోనా నివారణ చర్యలు, లాక్‌డౌన్ అంశాలపై ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. కరోనా వ్యాప్తి నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. నివారణ చర్యలతో పాటు కరోనాతో కలిసి జీవించే వ్యూహం రూపొందించాల న్నారు. కరోనా బాధితులకు ఇప్పటి మాదిరిగానే అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. కరోనా ఎంతకాలం ఉంటుందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కరోనా ప్రభావం ఉన్నా జీవనం సాగే విషయంపై వ్యూహం అవసరమన్నారు. కాంటాక్ట్ వ్యక్తుల పరీక్షలు జరగాలి. ఒకరి నుంచి మరొకరికి కరోనా సోకకుండా క్వారంటైన్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. అన్ని రకాల పరికరాలు, మందులు,

సదుపాయాలతో సిద్ధంగా ఉన్నామని సీఎం స్పష్టం చేశారు. వైద్యపరంగా అత్యుత్తమంగా స్పందిస్తామన్నారు. కరోనాతో పోరాడుతూనే ఇతరత్రా సిద్ధం కావాల్సి ఉందన్నారు. కొన్ని ఆర్థిక కార్యకలాపాలు కొనసాగాలి అని సీఎం చెప్పారు. గ్రీన్, ఆరెంజ్ జోన్లలో సందలింపులతో కొన్ని పనులు జరుగుతున్నాయని సీఎం తెలిపారు. భవిష్యత్‌లో సడలింపుల అమలుపై ప్రతిపాదనలు ఇవ్వాలి. జోన్ల వారీగా అనుసరించాల్సిన వ్యూహంపై ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

మనది సెంటిమెంటు కలిగిన దేశం. సొంతూర్లో పిల్లలను, తల్లిదండ్రులను వదిలి వచ్చారు. సొంత వాళ్లను చూసుకోవాలని వారికి ఉంటుంది. అందుకే సొంతూరు పోదామనుకుంటున్నారు. వారిని పోనివ్వకపోతే అనవసరమైన ఆందోళన తలెత్తుతుంది. ఒకసారి పోయి వస్తే, వారు స్థిమిత పడతారు. మళ్లీ పనిలోకి వస్తారు. శ్రామిక్ రైళ్లు వేయడం మంచి నిర్ణయం అని ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో చెప్పారు. తెలంగాణ నుంచి పోదామనుకుంటున్న వారిని పంపుతున్నం. మళ్లీ ఆ కూలీలు వస్తున్నారు. తెలంగాణ రైసు మిల్లులలో పనిచేసే బీహార్ కార్మికులు ప్రత్యేక రైలు ద్వారా మళ్లీ తెలంగాణకు వచ్చారు. వారిని మేము సాదరంగా స్వాగతించాం. వస్తారు, పోతారు. రానివ్వాలి, పోనివ్వాలి. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి అని సీఎం అన్నారు. కంటైన్మెంట్ జోన్లలో లాక్ డౌన్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. అలక్ష్యం చేయవద్దు. పాజిటివ్/యాక్టివ్ కేసులు లేని జిల్లాలను ఆరెంజ్/గ్రీన్ జోన్లుగా మార్చమని కేంద్రాన్ని కోరుతున్నాం. అలా ప్రకటించడంలో జాప్యం జరుగుతుంది. పాజిటివ్ కేసులు లేని ప్రాంతాల్లో ఇతర కార్యకలాపాలు నిర్వహించుకోవడం సాధ్యమవుతుంది. కాబట్టి రాష్ట్రాల నుంచి విజ్ఞప్తి రాగానే జాప్యం లేకుండా జోన్ల మార్పు జరగాలని సీఎం కేసీఆర్ కోరారు.

కోట్లలో ఆస్తి ఉన్నా సొంతకారు లేని థాక్రే

ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు వెల్లడి

ముంబై,మే12(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే తన ఆస్తుల వివరాలను వెల్లడించిన సందర్భంగా తనకు సొంత కారు లేదని తెలిపారు. తన కుటుంబ ఆస్తి మొత్తం విలువ కూడా.. రూ.143 కోట్లేనంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేస్తున్న ఉద్ధవ్.. తన ఆస్తుల వివరాలను ప్రకటించారు. నామినేషన్ వేసిన సందర్భంగా ఎన్నికల అధికారికి సమర్పించిన అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలు తెలిపారు. అఫిడవిట్ ప్రకారం.. తనకు సొంతంగా కారు లేదని.. స్పష్టం చేశారు.

తన భార్య రష్మీ థాక్రే శివసేన పార్టీ అధికారిక పత్రిక సామ్నాకు ఎడిటర్‌గా వ్యవహరిస్తోందని.. అంతేకా కుండా ఆమెకు పలు ఇతర వ్యాపారాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. తన భార్యకు వడ్డీలతో పాటు, రెంట్లు, షేర్ల ద్వారా కూడా లాభాలు వస్తున్నాయని పేర్కొన్నారు. డివిడెంట్ల ద్వారా కూడా ఆదాయం వస్తుందని.. అయితే ఆమెకు రూ.11.44 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. తనతో పాటుగా తన కుటుంబానికి కలిపి మొత్తం ఆస్తుల విలువ రూ.143.26 కోట్లు అని.. వీటిలో రూ.76.56 కోట్లు తన పేరుపై ఉండగా.. మరో రూ.52.44 కోట్లు తన భార్య రష్మీ థాక్రే పేరు మీద ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాదు..రూ.4.06 కోట్ల రుణంతోపాటుగా.. రూ.15.50 కోట్ల అప్పులు కూడా ఉన్నాయన్నారు. ఇక ఇప్పటి వరకు తనపై మొత్తం 23 కేసులు ఉన్నాయని.. వీటిలో దాదాపు 14 కేసులు సామ్నా పత్రికలో గీసిన కార్టూన్లు, ఆర్టికల్స్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నమోదైనవంటూ తెలిపారు.

భైంసాలో పద్ధతి ప్రకారమే అల్లర్లు: ఎంపి

నిర్మల్,మే12(ఆర్ఎన్ఎ): ఎంపీ సోయం బాపూరావు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భైంసాలో పథకం ప్రకారం అల్లర్లు జరుగుతున్నాయని ఆరోపించారు. రాత్రి కూడా కొందరు అలాంటి దాడులకే పాల్పడ్డారని అన్నారు. సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. మూకుమ్మడి ప్రార్థనలను ప్రశ్నించినందుకే దాడులు చేశారని అన్నారు. జిల్లా ఎస్పీ.. ఎంఐఎంకు వత్తాసు పలుకుతూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఎంపీ బాపూరావు ధ్వజమెత్తారు. పోలీసుల తీరు మారకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు ఎస్పీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఒక వర్గం ఓట్ల కోసం మెజారిటీ ప్రజలకు టీఆర్ఎస్ ద్రోహం చేస్తోందన్నారు. ఇలాగే కొనసాగితే చూస్తూ ఊరుకోబోమన్నారు.

మంత్రులు, అధికారుల ఆదేశాలు బేఖాతరు

తూకంలో తరుగు తీస్తూనే ఉన్నారు

విస్తారంగా పంటరావడంతో ఆలస్యంగా కొనుగోళ్లు

కరీంనగర్,మే12ఆర్ఎన్ఎ): మంత్రులు, అధికారులు ఆదేశించినా కొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం తరుగు తీస్తూనే ఉన్నారు. క్వింటాలు ధాన్యానికి 2 నుంచి 4 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు చెబుతున్నారు. కేవలం కొంత ధాన్యానికే కోతలు లేకుండా తీసుకుంటున్నారని చెబుతున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో విస్తారంగా వరి పంట సాగయ్యింది. కోతలు 85 శాతం వరకు పూర్తయ్యాయి. ఆలస్యంగా వేసిన వరి ఇప్పుడిప్పుడే కోతకు వస్తున్నది. వారం రోజుల్లో మొత్తం కోతలు పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో అప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయా, లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. 17 శాతం లోపే తేమ వచ్చినా పది, పదిహేను రోజుల తర్వాత కాంటాలు వేస్తున్నారని రైతులు చెబుతున్నారు కేం.ద్రాలకు ఇప్పటి వరకు కూడా లారీలు రాకపోవడంతో ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ఆయా మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. అయినా ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. హమాలీల కొరత, మిల్లర్లు తొందరగా అన్‌లోడింగ్ చేసుకోకపోవడం, లారీలు రాకపోవడంతో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. వరి కోసి పది, పదిహేను రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని తూకం వేయడం లేదు. అప్పుడప్పుడు వర్షాలు పడుతుండ డంతో రైతులు ఎక్కడ ధాన్యం తడుస్తుందోనని కలవరానికి గురవుతున్నారు. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో పరదాలను కిరాయికి తీసుకుని ధాన్యం కుప్పలపై కప్పుతున్నారు. 3.5 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. చాలా వరకు ధాన్యం కేంద్రాల్లో, వరి కల్లాల్లో ఉన్నది. తాలు, చెత్త ఉందనే సాకుతో క్వింటాలుకు 2 నుంచి 4 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా రైసుమిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులకు జిల్లాలో సాగైనా వరి ధాన్యమే గాకుండా మంచిర్యాల, మహబూబ్‌నగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ధాన్యాన్ని కేటాయించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల ధాన్యం నాణ్యతగా ఉందని అక్కడి నుంచి లారీల్లో వచ్చే ధాన్యాన్ని తొందరగా దించుకుంటున్నారుని రైతులు చెబుతున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తొందరగా ధాన్యాన్ని దించుకోవడం లేదని చెబుతున్నారు. దీంతో లారీలు తక్కువగా వస్తున్నాయి. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు రాకపోవడంతో నిర్వాహకులు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. కేంద్రాల నుంచి ధాన్యం తొందరగా తరలక పోవడంతో కాంటాలు పెట్టడం లేదు. ఒకసారి కాంటా అయిన తర్వాత ధాన్యం తడిస్తే దాని వల్ల వాటిల్లే నష్టం నిర్వాహకులే భరించాల్సి ఉండడంతో కాంటా పెట్టడం లేదు. ధాన్యం తరలింపును బట్టి కాంటాలు పెడుతున్నారని రైతులు చెబుతున్నారు. చాలా కేంద్రాల్లో రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారులు సత్వరమే స్పందించి ధాన్యం తరలింపు, మిల్లుల వద్ద తొందరగా దించుకునేలా, తరుగు తీయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని కూడా కామన్ గ్రేడ్ కింద కొన్ని కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో రైతులు క్వింటాలుకు 20 రూపాయలు నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు సీజన్ వచ్చిదంటే రైస్ మిల్లర్లకు పండుగ. కష్టపడి పంట పండించిన రైతులకు గుడ్డతు ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. మిల్లర్లు మాత్రం తాలుపేరిట దోచుకుంటున్నారు. 40 కిలోల బస్తాకు అదనంగా 2 కిలోలు తూకం వేస్తూ దండుకుంటున్నారు. అధికారుల మౌఖిక ఆదేశాలతోనే అదనంగా 2 కిలోలు తూకం వేస్తున్నామంటూ నిర్వాహకులు రైస్ మిల్లర్లకు పరోక్షంగా సహకరిస్తున్నారు. తాలుపేరిట జూబ్లీనగర్, నగునూర్ గ్రామాల్లో ధాన్యం తూకం వేయడం లేదంటూ ఇటీవల రైతులు ఆందోళన చేపట్టారు. ఈనెల 24న దుర్గేడు కొనుగోలు కేంద్రంలో 42 కిలోలు తూకం వేయడంపై రైతులు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. సాధారణంగా 40 కిలోల చొప్పున వడ్ల బస్తాను తూకం వేస్తారు. సంచి బరువు 600 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు ఉండటంతో కిలో అదనంగా ధాన్యం కాంటా వేస్తారు. అయితే దుర్గేడు సహకార సంఘం పరిధిలోని ఇరుకుల్ల, మొగ్దుంపూర్, గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి, చేగుర్తి కొనుగోలు కేంద్రాల్లో తాలుపేరిట మొత్తం 42 కిలోల ధాన్యం కాంటా పెడుతున్నారు. మేలు రకం ధాన్యం తెచ్చినా అదనంగా 2 కిలోలు తూకం వేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాలుపేరిట మిల్లర్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై లాక్‌డౌన్

కేంద్రమే ముందుకు వచ్చి ఆదుకోవాలి

చిన్న తరహా పరిశ్రమలకు వడ్డీలేని రుణాలివ్వాలి

రాష్ట్రాల మధ్య సరుకు రవాణా నిరాఘాటంగా సాగాలి

మోడీతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం వైఎస్ జగన్

అమరావతి,మే12(ఆర్ఎన్ఎ): రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. కేంద్ర సహకారం కావాలని సిఎం వైఎస్ జగన్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు బాగుంటేనే.. పేదలకు మేలు జరుగుతుందన్నారు. లాక్‌డౌన్ సడలింపు చర్యల నమయంలో ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నట్లు సిఎం ప్రధాని మోడీతో చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూడా పైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పంటకూ కనీస మద్దతు ధర ప్రకటించింది. రాష్ట్రాల మధ్య రవాణాకు సంబంధించి పూర్తి అవరోధాలు తొలగిపోవాలన్నారు. దీనికి తోడు.. వడ్డీలు లేని లేదా వడ్డీలు తక్కువగా ఉండే దీర్ఘకాలిక చెల్లింపుల ప్రాతిపదికన రుణాలు ఇవ్వాలన్నారు. ప్రజల్లో భయం, ఆందోళన తొలగించడం ద్వారానే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్‌పై కేంద్రం సూచనలు, సలహాలకు అనుగుణంగా రెండు నెలల నుంచి చర్యలు తీసుకుంటు న్నామని ప్రధాని నరేంద్ర మోదీకి తెలిపారు. తద్వారా కరోనా పాజిటివ్ కేసులను నియంత్రించగలిగామని న్నారు. దేశ వ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ మరోసారి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి బోధనాసు పత్రుల వరకూ ఆస్పత్రులన్నింటినీ కూడా జాతీయ ప్రమాణాల స్థాయికి అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని సులభంగా చేరుకుంటామన్నారు. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ఇచ్చే ఈ రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకురాకుండా ఉండాలని కోరుతున్నాం. ఎంఎస్ఎంఈ రంగం స్తంభించి పోతే.. నిరుద్యోగం అన్ని చోట్లా పెరుగుతుంది. అందువల్ల 6 నెలలు, అంటే 2 త్రైమాసికాలు ఎంఎస్ఎంఈలకు వడ్డీమాఫీ చేయాలన్నారు. ధాన్యం సేకరణలో ప్రస్తుతం ఉన్న పరిమితిని 30 శాతం నుంచి 50 శాతానికి పెంచాలన్నారు. 6 వారాల లాక్‌డౌన్ పరిస్థితులను సమీక్షించుకుంటే.. సాధారణ పరిస్థితులు నెలకొనే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడుసార్లు సమగ్రసర్వే నిర్వహించామని, కరోనాను నియంత్రించలేకపోతే ముందుకు వెళ్లలేమని అన్నారు. కరోనాకు వ్యాక్సిన్ కనుగొనే వరకు వైరస్‌తో మనం ముందుకు సాగాల్సి ఉందన్న విషయాన్ని అవగాహన కల్పించాలి. భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ముఖ్యమైనవి. ఆస్పత్రులు, ఆరోగ్య మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి రూ.16వేల కోట్లు ఖర్చు అవుతోంది. వడ్డీలేని, తక్కువ వడ్డీ ఉండే దీర్ఘకాలిక రుణాలివ్వాలి. ప్రజారోగ్యానికి ఇచ్చే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలి. ఎంఎస్ఎంఈలకు ఆరునెలల కాలానికి వడ్డీలు మాఫీ చేయాలని జగన్ కోరారు. ఇక కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే మూడు పర్యాయాలు సమగ్ర సర్వే చేపట్టామని ప్రధాని మోదీకి తెలిపారు. ఇందులో భాగంగా దాదాపు 30 వేల మందిలో కరోనా లక్షణాలు కనిపించడంతో.. వారందరికీ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్ల ద్వారా సర్వే కొనసాగించామని ప్రధానికి తెలిపారు. కోవిడ్‌ను నియంత్రించలేకపోతే ముందుకు వెళ్లలేమన్న సీఎం జగన్...

కరోనా పాజిటివ్ లక్షణాలు గుర్తించిన కుటుంబాలు సమాజంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సోకిన వారిని సమాజం వేరుగా చూస్తుందన్న భావన నెలకొందని.. ఈ కారణం వల్లనే కరోనా లక్షణాలు ఉన్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలు కరోనా పరీక్షల ముఖ్య ఉద్దేశం, లక్ష్యాలపై ప్రభావం చూపిస్తోందన్నారు. కరోనా కేసులు కనిపించిన ప్రాంతాలను క్లస్టర్లు, కంటైన్మెంట్ జోన్లుగా గుర్తించడం.. అదే విధంగా సంస్థాగతంగా క్వారంటైన్ పక్రియపై మరోసారి ఆలోచన చేయాల్సి ఉందని సీఎం జగన్ అన్నారు. ఈ పక్రియలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒక వ్యూహంతో వ్యవహరించాల్సి ఉందని.. ఇందులో భాగంగా కరోనా లక్షణాలు కనిపిస్తే స్వయంగా చెప్పడం, వైద్య సహాయం పొందడం, తమంతట తాముగా ఐసొలేషన్‌కు వెళ్లేలా అప్రమత్తం చేయాలన్నారు. దాదాపు 98 శాతం కేసులు నయం చేయగలమన్న విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 85 శాతం కేసుల్లో మైల్డ్ సింప్టమ్స్ మాత్రమే కనిపిస్తున్నాయి... కాబట్టి కరోనాకు వ్యాక్సిన్ కనుక్కొనే వరకు ఆ వైరస్‌తో మనం కలిసి ముందుకు సాగాల్సి ఉందన్న విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. కరోనా పాజిటివ్ లక్షణాలు గుర్తించిన కుటుంబాలు సమాజంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయి. సమాజం వారిని వేరుగా చూస్తుందన్న భావన నెలకొంది, వివక్ష కనిపిస్తోంది. ఈ కారణం వల్లనే కరోనా లక్షణాలు ఉన్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చెప్పడం లేదు. ఇది మొత్తం కరోనా పరీక్షల ఉద్దేశం, లక్ష్యాలపై ప్రభావం చూపిస్తోంది. కరోనా కేసులు కనిపించిన ప్రాంతాలను క్లస్టర్లు, కంటైన్మెంట్ జోన్లుగా గుర్తించడం,